Barcode : 2990100049579
Title - shrii raamakrxshhnd-a prabha janavari 1951
Author - no
Language - telugu
Pages - 34
Publication Year - 1951
Barcode EAN.UCC-13
2 990100 049579

# శ్రీ రామకృష్ణ ప్రభ

౧౯౫౨, జనవరి—ఖర, పుష్యము

సంపుటము ౮ సంచిక ౭

C.P. BROWN
MEMORIAL LIBRARY
Acc. No. 88
Date
CUDDAPAH.

శ్రీ రామకృష్ణమఠము, మైలాపూరు

చెన్నపురి

# విషయసూచిక


| | |
|---|---|
| ప్రార్థన | ౧౬౯ |
| శ్రీ రామకృష్ణ వచనామృతము—'సు.' | ౧౭౦ |
| శ్రీ వివేకానంద ప్రతిభ | ౧౭౩ |
| శ్రీ తురీయానంద లేఖావళి | ౧౭౫ |
| శ్రీ వాసుదేవ మననము—శ్రీ మాచిరాజు శ్రీరామకృష్ణ | ౧౭౭ |
| పవిత్రమాత శ్రీ శారదాదేవి—శ్రీమతి డాక్టర్ రామకృష్ణమ్మ | ౧౮౩ |
| దేవీ స్తవము—శ్రీ ఆత్మానందస్వామి | ౧౯౦ |
| సర్వధర్మ సమన్వయమే మతాదర్శము—శ్రీ వివేకానందస్వామి | ౧౯౩ |
| తెలుగు భాషా సమితి, మద్రాసు | ౧౯౫ |


# శ్రీ రామకృష్ణ ప్రభ

## చందాదారులకు

౧. పత్రిక ప్రతిమాసము 20-వ తేదీన వెలువరింపఁబడును. ఒక వారము, పదిరోజులు చూచి ప్రతి మీకు అందకపోయినయెడల ఉత్తరము వ్రాయుఁడు.

౨. సంవత్సర చందా రు. 3 లు మాత్రమే. జనవరి నెల నుండిగాని జూలై నెల నుండిగాని చందాదారులుగఁ జేరవచ్చును. ఇతర మాసములలోఁ జేరదలచు వారికి జనవరి నెల నుండిగాని జూలై నెల నుండిగాని సంచికలు చేర్చిపంపఁబడును. విడిప్రతి రూ. ౦—౬—౦ లు. హిగిన్‌బాదంస్ వారి స్టాలులోఁగాని, మా పత్రిక ఏజెంటును గాని అడుగుఁడు.

౩. ఉత్తర ప్రత్యుత్తరములు వీలైనంతవఱకు ఇంగ్లీషున వ్రాయుచు మీ చందాదారు సంఖ్య నుదాహరింపుఁడు. ఉత్తరములను "మేనేజరు, శ్రీరామకృష్ణప్రభ" అను చిరునామాకు వ్రాయుఁడు.

౪. చిరునామాయందు ఎట్టిమార్పుగలిగినను 10-వ తారీఖునకు ముందుగా మా కార్యాలయమునకుఁ దెలుపవలయును. లేనిచో, పత్రిక పూర్వపు చిరునామాకే పంపఁబడును.

## వ్యాసకర్తలకు

౧. కేవలము నైతిక ధార్మిక వైజ్ఞానిక విషయకములైన వ్యాసములేకాక, సాహిత్యమునకును కవిత్వమునకును సంబంధించిన ఏ వ్యాసములైనను బంపవచ్చును. సులభ సుందరమగు గ్రాంథిక భాషలో వ్రాయవలయును.

౨. వ్యాసములు అచ్చులో మూఁడు పుటలకు మించరాదు. ప్రతి నెల ఒకటవ తేదీకి వ్యాసములు మాకు అందవలెను.

౩. వ్యాసములను, విమర్శకుఁ బంపు గ్రంథములను, వినిమయముగఁ బంపెడి పత్రికలను "సంపాదకుఁడు, శ్రీ రామకృష్ణ ప్రభ శ్రీ రామకృష్ణ మిషన్ స్టూడెంట్స్ హోమ్, మైలాపూరు, చెన్నపురి" అను చిరునామాకు వ్రాసి పంపవలెను.

౪. వ్యాసము తిరుగఁ బంపఁబడవలయుననుచోఁ దగు పోస్టేజి చేర్చి పంపవలయును.

# శ్రీరామకృష్ణ ప్రభ

సంపుటము ౧ { ౧౯౫౨ - జనవరి :: ఖర - పుష్యము } సంచిక ౮


## ప్రార్థన

శ్లో. గోపాలాజిర కర్దమే విహరసే విప్రాధ్వరే లజ్జసే
బ్రూషే గోధనహుంకృతైః స్తుతిశతైర్మౌనం విధత్సే విదామ్ ।
దాస్యం గోకులపుంశ్చలీషు కురుషే స్వామ్యం న దాంతాత్మసు
జ్ఞాతం కృష్ణ! తవాంఘ్రిపంకజయుగే ప్రేమాచలం మంజులమ్ ॥

ఓ కృష్ణా! నీవు గొల్లవారింటి ఎదుటి ధూళిలో ఆడుకొనెదవు కాని, బ్రాహ్మణుల యాగశాలలకు దూరముగా నుందువు. పశువుల అర్పులకు పలుకుదువు కాని, విద్వాంసుల ప్రార్థనలకు జవాబియ్యవు. వ్యభిచారవిహారలయిన * గొల్లపడుచులకు దాస్యము చేయుదువు కాని, తమ ఆత్మలను సమర్పించెడి యోగులను జేర్చుకొనవు. ఆహా! ఇప్పుడు నేను నిన్ను గుర్తింపగలిగితి. సరియైన భక్తియుండిననే నీచరణారవిందములు కదలును.

శ్రీ కృష్ణకర్ణామృతము 11-82.

* (తమకు వివాహమయి భర్త లున్నప్పటికి, రహస్యముగా నిన్ను ప్రేమించు)

ఓం నమో భగవతే శ్రీరామకృష్ణాయ !

# శ్రీ రామకృష్ణ వచనామృతము — ‘మ.’

## సింధూరియాపటి బ్రహ్మసమాజమున శ్రీ రామకృష్ణుడు

కార్తీక బహుళైకాదశి,
26 నవంబరు 1883.

మణిలాల్ మల్లికుని యింటియందు సింధూరియాపటి బ్రహ్మసమాజపు వార్షిక సమావేశము జరిగెను. ఉపాసనాగ్రహము ఆనందపూరితమై యలరారుచుండెను. లోపలను బయటను—ఎల్లెడలను పుష్పమాలలతోడను తోరణములతోడను అలంకరింపబడి యుండెను. మందిర మధ్యమున భక్తులు ఉపాసనారంభమునకై ఎదురుచూచుచుండిరి. లోపల నెల్లరకును చోటు లభింపమిచే వెలుపలి మిద్దెమీద కొందరు పచారుచేయుచుండిరి. అపుడపుడు గృహస్థు బంధువులకు ఉత్సవాగతులకు కుశలప్రశ్నలతో స్వాగతమిచ్చుచుండెను. నాటి యుత్సవమున విశేష మొకటి యుండెను. శ్రీ రామకృష్ణులవారు ఆ యుత్సవమున పాల్గొనుటయే యందలి విశేషము; అదియే ఉత్సవాగతుల యుత్సాహాధిక్యమునకు హేతువు. కేశవచంద్రసేనుడు విజయకృష్ణ గోస్వామి, శివనాథ శాస్త్రి—మున్నగు బ్రాహ్మసమాజ నిర్వాహకులందరును శ్రీ రామకృష్ణులను మిక్కిలి గౌరవముతో జూచుచుండిరి. శ్రీ రామకృష్ణులవారు భగవత్ప్రేమతో మైమఱచెడివారు. వారి భగవద్భక్తి ఆదర్శనీయ జ్వాలంతవిశ్వాసము. భగవానునితో బాలునివలె సంభాషించుట, భగవద్దర్శనార్థము వ్యాకులము బూనుట, స్త్రీజాతిని మాతృభావముతో బూజించుట, విషయ తైలధారోపమమగు నిరవచ్ఛిన్న భగవత్కథా ప్రసంగము, వారి సర్వధర్మ సమన్వయము, మతాంతర ధర్మములయందలి విద్వేషరాహిత్యము, భగవద్భక్తికై యాక్రందనము—ఇవన్నియు బ్రహ్మసమాజ భక్తుల చిత్తము నాకర్షించెను. కావుననే ఎందఱో భక్తులు అత్యంత దూరప్రదేశములనుండియు నచ్చటి కేతెంచియుండిరి.

ఉపాసనాత్పూర్వము విజయకృష్ణ గోస్వామి మున్నగు బ్రాహ్మభక్తులతో స్మేరాననులై శ్రీ రామకృష్ణులు మాట్లాడుచుండిరి. ఆలయమున దీపములు వెలిగింపబడినవి. కొలదికాలమునకే ఉపాసన ప్రారంభము కానుండెను.

శ్రీరామ:—ఏమోయ్! శివనాథుడు రాడా!

ఒకభక్తుడు:—లేదండి, ఆయన కీరోజు పను లెక్కువగా నున్నవి. ఆయన రాజాలడు.

శ్రీరామ:—శివనాథుని జూచిన నాకు చాల ఆనందము కలుగును. అతడెల్లప్పుడును భక్తిరసనిమగ్నుడై యున్నట్లే కనిపించును. మఱియు అనేకు లెవనియెడ మిక్కిలి గౌరవము జూపి ఆదరింతురో అట్టివానియందు తప్పక భగవద్భక్తి యుండునన్న పలుకు సత్యము. సమస్త విషయములును సరిపడి

యున్నను శివనాథునియందు గొప్ప దోషమొకటి కలదు. మాట నిలుపక పోవుటయే ఆ దోషము. ఒకమారు దక్షిణేశ్వరమునకు వచ్చెదనని నాతో జెప్పెను. కాని రాలేదు. పోనీ కబురుకూడ పంపలేదు. ఇట్లు చేయుట మంచిదికాదు. కలియుగమున సత్యవాక్పరిపాలనమే తపమని ప్రవచింపబడియున్నది. ఎవరైనను సత్యమును అంటిపట్టుకొనియున్నచో వారికి భగవద్దర్శనము తప్పక లభించును. సత్యమునందు బద్ధమనస్కుడు కానివానికి క్రమక్రమముగా సర్వనాశనము గలుగును. కావుననే ఎపుడైనను బయటికి పోవుదునని పలికినచో అవసరము లేకపోయినను చెంబు బట్టుకొని దొడ్డిలోనికి బోవువాడను, సత్యవాక్పరిపాలనా నైరుధ్యము జరుగునేమోయన్న భయమే యిందులకు కారణము. నాకీ స్థితి కలిగిన పిదప లోకేశ్వరి యెదుట పుష్పములు చేతబట్టి నిలువంబడి 'అమ్మా! ఇదిగో నీ జ్ఞానము, తీసికొనుము, ఇదిగో నీ యజ్ఞానము, దీనినిగూడ గైకొనుము. తల్లీ! నాకు శుద్ధభక్తి నొసంగుము. ఇదిగో నీ శుచి, ఇదిగో నీ యశుచి; ఈ రెండింటిని దీసికొని నాకు శుద్ధభక్తిని ప్రసాదింపుము. ఇదిగో నీ మంచి, ఇదిగో నీ చెడ్డ; ఈ యుభయమును గ్రహించి నాకు శుద్ధభక్తిని దయచేయుము. ఇదిగో నీ పాపమును పుణ్యమును; ఈ జంటను గైకొని నాకు శుద్ధభక్తి నిమ్ము.'—ఇట్లు సమస్త ద్వంద్వములను ఆ తల్లికి అర్పించినను 'తల్లీ! ఇదిగో నీ సత్యము, ఇదిగో నీ యసత్యము; వీనిని పరిగ్రహింపు'మన్న పలుకులు మాత్రము వచింపజాలకపోయితిని. అన్నిటిని తల్లికి సమర్పింపగలిగినను సత్యమునుమాత్ర మొసగజాలకపోయితిని.

బ్రహ్మసమాజ నియమానుసారము ఉపాసన యుపక్రమింపబడెను. వేదికపైన వారి యాచార్యులు కూర్చొనిరి. వారియెదుట ఒక 'షేడ్ దీపము' వెలుగుచుండెను. ప్రార్థనానంతరము ఆచార్యులు వేదోక్త పరబ్రహ్మ మంత్రమును బఠింప నారంభించెను. బ్రాహ్మభక్తులు గూడ సుస్వరముతో సనాతనార్య ఋషీశ్వరులుపఠించిన ఆ మంత్రము నుచ్చరించుచు నామగానము చేయనొడంగిరి. వారు 'సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ, ఆనందరూప మమృతం యద్విభాతి శాంతం శివ మద్వైత శుద్ధ మపాపవిద్ధం.........' అని పలుకుచుండిరి. ప్రణవసంయుక్తమయిన ఈ ధ్వని భక్తుల హృదయాకాశమున ప్రతిధ్వనించుచుండెను. అనేకులు ఏకాగ్రచిత్తులై ధ్యానపరవశులైరి. అందరును కండ్లు మూసికొనియుండిరి. క్షణకాలము వారందరును వేదోక్త సగుణబ్రహ్మ చింతనముచేసిరి.

శ్రీ రామకృష్ణుడు భావావేశ నిమగ్నుడయ్యెను. స్పందనరహితుడై స్థిరదృష్టితో చిత్రపటమువలె కూర్చొనియుండెను. ఆత్మపక్షి యెచ్చటికో ఎగిరిపోయి ఆనందముతో విహరించుచుండెను. శరీరము మాత్రము ఈ మందిరమున బడియుండెను.

సమాధ్యనంతరము కండ్లుదెఱచి శ్రీ రామకృష్ణు డొకమారు నలుగడల జూచెను. అందరును వారినే చూచుచున్నట్లుండెను. అపుడు 'బ్రహ్మ, బ్రహ్మ' యని చెప్పుచు ఆయన యకస్మాత్తుగ లేచి నిలువంబడెను. ఉపాసనానంతరము బ్రాహ్మభక్తులు మృదంగ కరతాళములతో సంకీర్తనము ప్రారంభించిరి. శ్రీ రామకృష్ణుడు ప్రేమానందభరితుడై వారితో కలసి నృత్యము చేయ మొదలిడెను. అందరును ముగ్ధులై యా నృత్యమును జూచుచుండిరి.

విజయుడు నితర భక్తులునుగూడ ఆయనను జుట్టి నృత్యముచేసిరి. ఈ యద్భుతదర్శనాలోకమున ప్రేక్షకులెల్లరు తమ సాంసారిక చింతలనెల్ల మఱచిరి; ఆ క్షణకాలమున హరి రసామృతపానము గావించి విషయానంద సుఖమును సంపూర్ణముగ మఱచిరి. విషయసుఖములు వారికి చేదయ్యెను. సంకీర్తనము ముగిసినది. అందఱును శ్రీ రామకృష్ణు లేమి పలుకుదురో యని యెదురుచూచుచుండిరి.

శ్రీరామ:—నిర్లిప్తులై సంసారముచేయుట మిక్కిలి కష్టము. ప్రతాపు నాతో నొకమారు 'అయ్యా! మేము జనకమహారాజువలె నుందుము. జనకుడు నిర్లిప్తుడై సంసారము చేయలేదా? అట్లే మేముగూడ చేయుదుము' అని పలికెను. అంతట నేను 'అనుకున్నంతలో మనము జనకమహారాజులము కాగలమా? జనకమహారా జెంతటి తపస్సుచేసి జ్ఞానమును బడసెనో యెఱుగుదువా? ఎన్నియోసంవత్సరములు శిరస్సు క్రిందికి పాదములు పైకి బెట్టి ఘోరతప మాచరించిన తర్వాతనే సంసారమున ప్రవేశించెను.

అయినచో సంసారమునం దున్నవారికే యుపాయమును లేదా యని సందేహింపవచ్చును. ఔను, తప్పక యున్నది. కొన్నాళ్లు నిర్జనస్థలమునకు బోయి సాధనలు సలుపవలయును. అప్పుడే భక్తియు జ్ఞానము లభింపగలవు. అటుపయిన సంసారము చేయువచ్చును. అంతట నే పాపము నంటదు. నిర్జనస్థానమున సాధన లెప్పుడు చేయుదువో ఆ సమయమున సంసారమునుండి సంపూర్ణముగ తొలగి వర్తింపుము. ఆ సమయమున భార్యాపుత్రాదులు మాతాపితలు, సోదరీ సోదరులు, కుటుంబ బంధువులు—వీరెవరును దగ్గర నుండరాదు. ఒంటరిగానున్న ఆ సమయమున 'నా కెవరును లేరు. భగవానుడే నా సర్వస్వము' అని తలంపవలయును. మఱియు మిక్కిలి వ్యాకులముతో ఆయన యెదుట భక్తిజ్ఞానములకొఱకై ప్రార్థింపవలయును.

'నేను ఎన్నాళ్లు సంసారమును వదలి చరింపవలయు'నని యడిగినచో నది నీ వీలుననుసరించి యుండును. ఒకదినమయినను నీ విట్లుండ గలిగినచో అదియును శ్రేయస్కర విషయమే. మూడుదినము లుండగలిగిన నింకను మంచిది. మరి పండ్రెండుదినములో, నెలయో, మూడు మాసములో, సంవత్సరమో—ఎవ రెట్లు చేయగలరో యట్లు ప్రవర్తింపవచ్చును. జ్ఞానము, భక్తి—ఈ రెంటిని బడసిన పిదప సంసారమున నుండిన నే భయమును లేదు.

చేతికి నూనె బూసికొని పనసపండును కోసినచో పాలు చేతి కంటదు. దాగురుమూతలాడుకొనుచో తల్లిని తాకినపిదప నిక భయము లేదు. స్పర్శవేదిని దాకి నీవు బంగారమవయినచో వేయిసంవత్సరములు మట్టిక్రింద పడియుండినను బయటికి దీసినచో బంగారమవుగనే యుందువు.

మనస్సు పాలవంటిది. ఆ మనస్సును సంసారజలముతో జేర్చినచో పాలు నీరు కలసిపోవును. అందువలన ఆ పాలను నిర్జనస్థానమున తోడువెట్టి వెన్న తీయవలయును. నిర్జనస్థానమున సాధనములు సలుపునపుడు మనస్సను పాలనుండి భక్తిజ్ఞానరూపకమగు వెన్న బయలువడును. ఇక ఆ వెన్నను సంసారజలమున నిర్భయముగా నుంచవచ్చును. అది ఆ నీటిమీఁద నిర్లిప్తమై తేలును.

# శ్రీ వివేకానంద ప్రతిభ

శ్రీ వివేకానందస్వాములవారు శరీరత్యాగము గావించి యిప్పటికి ఏబది సంవత్సరములు పూర్తికానున్నవి. ఆ ప్రచండమారుతాభములగు నుపన్యాసములన్నియు నాడే ముగిసినవి. అవియన్నియు దర్పణమునందలి ప్రతిబింబములవలె నేడు ప్రకటింపబడి యెల్లయెడల నెల్లరకును లభించుచున్నవి. కాని అవి యెంతటి ప్రాచీనములయినను నేడును నవి పాఠకలోకమునకు నిత్యనూతనములై యపూర్వోత్సాహ సందాయకములై యున్నవనుట నిర్వివాదాంశము. వారి యుపన్యాసములేమి వారి వ్యాసరాజములేమి లేఖలేమి చదివినంతటనే శ్రీవారి హృదయమునుండి వెలువడినట్లు గోచరించి శ్రీవారి వ్యక్తిత్వమును సాక్షాత్కరింపజేయుచున్నవి. దేశభక్తులా ఆ గ్రంథపఠనమున ఇట్టిదా దేశభక్తి యని గుర్తింపగలుగుచున్నారు. హిందూమతవిశిష్ఠత నరయగోరినచో వారి గ్రంథముల మూలమున హిందూమతాశయములు ధర్మములు మున్నగు సర్వవిషయములును విపులముగ మనకు దెలియగలవు. సాంఘిక దురాచారములు సర్వమును బట్టబయలుగ కనుబఱచి మన హీనదీనావస్థలకు మనమే యెంతటి బాధ్యులమై యున్నామన్న విషయమును స్పష్టము గావించుచున్నవి ఆ గంభీరవాక్కులు. శ్రీవారిని మించినవారు కాకున్నను వారితో సమానులగు దేశభక్తులు న భూతో న భవిష్యతి. దానికితోడు శ్రీవారు త్యాగమూర్తులు. ఎందఱో త్యాగపురుషులు ఆత్మముక్తికై సాధనలు గావించువారు—ఇతరుల ముక్తిని లక్ష్యపెట్టనివారు, చివరకు మాటలాడుటయు పతనహేతువని మౌనముద్రను ధరించినవారు—మన దేశమున తండోపతండములుగ వెలసియుండిరి, యున్నారు, ఉండగలరు. కాని శ్రీ వివేకానందస్వాములవారు వీరసన్యాసి. హిందూదేశము మూలమూలలందును వీరపురుషులతో వీరరమణీమణుల తోడను నిండియుండవలయుననుటయే వారి కోరికయును. 'అన్నింటికంటెను శ్రేష్ఠమయినది బలము, వీర్యము. వీరుడవుకమ్ము. దుష్టుడయినను వీర్యమును, బలమును ప్రకటింప గలిగినచో వానిని నేను గౌరవింతును. ఏలనన వానియొద్ద శక్తి యున్నది. ఎప్పటికి ఒకనాడు ఆ శక్తి వాని దౌష్ట్యమును నశింపజేయగలదు; స్వార్థపరాయణతను రూపుమాపి ఎన్నటికైనను సత్యమార్గము ననుసరింపజేయగలదు'' అన్న గంభీరవాక్కులే శ్రీవారి వీరసన్యాసమును ప్రకటింపగలదు.

శ్రీవారి శరీరసౌష్టవము వీరావేశమునకును వీర్యబోధనమునకును శ్రీవారే తగిన వారని నిరూపించుచున్నది. అందువలననే వారు ఏ సమయమున, ఏ విషయమున నెట్టి దోషము సంఘటిల్లినను వీరావేశముతో నిర్భయముగ ఎవరి తప్పిదముల వారియెదుట కండ్లకు గట్టినట్లు స్పష్టము చేయుచుండెడివారు. శ్రీవారితో వాగ్వాదన గావించి జయించుట కల్ల. సత్యము నాశ్రయించినవారియందు భయ మెట్లు పొడ

చూపగలదు? ఆత్మజ్ఞానికి భయము లేదని యుపనిషత్తులు ఘోషించుచున్నవిగదా! భారతదేశమునకు పునరుద్ధరణ కల్పింప నెంచిన మహాత్ముడు—పరుల వంశమర్యాదలను ఐశ్వర్యమును చూచి వారియందలి దోషముల వెలిబుచ్చుటకు సంకోచించినచో, నిక దేశము గతి యేమి? తన ఉద్యమఫలమేమి? సర్వత్యాగులగు సన్యాసుల కీ దేశోద్ధరణ పరాయణత యేల యని మనము తలంపవచ్చును. శ్రీవారి జీవితానుసారము విమర్శించినచో ఈ విషయమున కొన్ని ధర్మసూక్ష్మములు విస్పష్టముగ గోచరింపగలవు. తమ గురుదేవుడగు శ్రీ రామకృష్ణులవారి నిర్యాణానంతరము శ్రీవారు దేశపర్యటన మారంభించిరి. నాడు శ్రీవారు జీవితసౌధమున వివిధములగు సంతస్తులయందున్న వారిని కలిసికొని భారతదేశపు నిజస్థితిని నరయగలిగిరి. పండితులు, పామరులు, మహారాజులు, దీనులు, నిమ్నులు—అందఱనుజూచి, కలిసికొని వారివారి జీవితపంథా ఎట్లు నడుచుచున్నదో చక్కగా గుర్తించిరి. ఇట్లు ఆసేతుహిమాచలముగ దిరిగి కన్యాకుమారి జేరి శ్రీ కన్యకాపరమేశ్వరీ దేవాలయము నెదుటనున్న భారతదేశీయ పరమావధి యనదగు చిట్టచివరిగట్టున గూర్చొన్న శ్రీవారికి సమస్తభారతావనియు దాని ఇతిహాసమును ఛాయాచిత్రమువలె గోచరించెను; భారతదేశపు పురాతన ఔన్నత్యము ఒకవైపున, ఆధునిక దేశీయ నిమ్నావస్థ మఱియొకవైపున. ఈ రెండింటిని జూచినంతట శ్రీవారి నేత్రద్వయమునుండి యశ్రుధార ప్రవహింపసాగెను. "ఆహా! ఎందఱో మహానుభావులను మహాపురుషులను ప్రభవింపజేసినది ఈ భారతదేశము. సమస్త ప్రాపంచికశాంతికి శంకుస్థాపన గావింపగల ధార్మికగ్రంథములకు పుట్టినిల్లు ఈ భారతదేశము. భౌతికజీవనమునకు సూటియై మార్గదర్శకములై విరాజిల్లెడి మహావాక్యసందోహములన్నియు మిక్కుటముగా వెదజల్లినది ఈ భారతదేశము. ఇంతటి ఔన్నత్యము, సౌజన్యము, సౌహార్దము కలిగియున్నను ఈ దేశమున కిట్టి పతనావస్థ సంభవించినది గదా! మహాఋషుల సంతానము క్రిమికీటకతుల్యమయ్యెగదా! వీరి నుద్ధరింపగలవారొక్కరు లేరోకో!" అని తలంచిన కొలదియు వారి దుఃఖము అనివార్యమయ్యెను. శ్రీవారి హృదయమంతయు విశ్వమానవప్రేమతో పరిపూర్ణమయ్యెను. ఇదియేకదా భారతదేశీయ ఆధ్యాత్మికజీవనలక్ష్యము! ఆత్మసాక్షాత్కారము గాంచినవాని హృదయము వైశాల్యము నందును. న్యూనాధిక్యతలు గోచరింపని యాతని ప్రేమ సమస్త ప్రపంచమునందును సమానముగ వర్షించును. పూర్ణావతారుడగు శ్రీ కృష్ణభగవానుడు గీతయందు "సర్వభూతములయందును దన్ను (భగవానుని) గాంచువాడే జ్ఞాని" యని యెన్నిసార్లు ఉద్ఘోషింపలేదు? అవతారపురుషుల జీవితములే పరికింపుడు. వారి అపారప్రేమ అత్యంతకష్టభూయిష్ఠులై యల్లాడు దీనులయందు ఎంతగా స్నిగ్ధము కాలేదు? ఋష్యంశ సంజాతుడనియు నరనారాయణాంశజుడనియు శ్రీ రామకృష్ణ గురుదేవునిచే పొగడ్తగాంచిన శ్రీ వివేకానందస్వాములవారి కిట్టి అపార అవ్యాజప్రేమ పొడముట స్వాభావికమే కదా! ఒక్క తమ సంక్షిప్త జీవితకాలమున ఈ సర్వప్రపంచమునందలి దీనుల కష్టముల బాపుట దుష్కరమని గమనించిన శ్రీవారు ఆయా ఘట్టములందు ఆయా మార్గములందు పురోగమనమునకు పరిపూర్ణతకు వలయు కార్యవిధానపథకమును తయారు

చేసియున్నారు. తమ యనుచరులు కావింపవలయు కార్యప్రణాళికను శ్రీవారు తమ యుపన్యాసములందు పదేపదే వివరించియున్నారు. మన భారతదేశము పూర్వపు ఔన్నత్యమునుబడయవలయునన్నచో తమ స్వార్థమానవత్వమును సంపూర్ణముగ నడంచి ఎల్లరును పశుతుల్యులు క్రిమికీటకప్రాయులు నగు నధఃపతితులను నుద్ధరింపబూనవలయును. నేటి భారతీయులం దధిక సంఖ్యాకులకు విద్య సున్న. ఆహారము సయితము లేదు. దానిని సంపాదించుకొను మార్గమును వారెఱుంగరు. వారియందు దేశభక్తినో లేక నిశ్చలమగు దైవభక్తినో ఆకాంక్షించుట వ్యర్థము. ఇట్టివారందఱకును మానవత్వమును గల్గింపవలయును. తద్వారా వారికి తమ స్వశక్తిని నిరూపించి లోకశ్రేయమునకు దారి తీయవలయును. ఈ విషయమున శ్రీ వివేకానంద సూక్తులు మానవ హృదయముల బ్రవేశించి రేకెత్తించి ఉద్యమప్రాప్తికి మార్గదర్శకము లగునుగాక!

# శ్రీ తురీయానంద లేఖావళి

శ్రీహరిశ్శరణమ్

ఆల్మోరా,
4-5-'15.

శ్రీమాన్ దే...

నీవు జూన్ 26 న వ్రాసిన యుత్తరమును జూచి యెంతయు నానందించితిని. భగవానుడు మీ హృదయమున నిల్చి మిమ్ము సచేతనుల గావించి స్వీయభక్తి కధికారుల జేయుగాక! ఆయన కృపవలన ఈ మానవజన్మము విమల సుఖభోగము ననుభవించుగాతమనియే నా ప్రార్థన.

ఎంతయో పుణ్యమొనరించిననే కాని యీ మానవజన్మ లభింపదు. మనము మానవజన్మ నందగనే మనకు మోక్షద్వారము దెఱువబడును. ఇట్టి శరీరమును బడసియు ముక్తికై ప్రయత్నింపనిచో మఱల మనకిట్టి యవకాశ మెన్నడు లభించునని యెవరు వచింపగలరు? కావున నీ జన్మమునందే చైతన్య ప్రాప్తికి దగుమార్గము నన్వేషించుటయే మన ప్రధాన కర్తవ్యము. శాస్త్రములందు సయిత మిట్లు ప్రవచింపబడియున్నది. "శ్లో. మహతా పుణ్యపుంజేన వృతోఽయం కాయనౌస్త్వయా, పారం దుఃఖోదధేర్గంతుం తర యావన్న భిద్యతే—ఎంతటి పుణ్యకర్మములవలననో దుఃఖరూపమగు సంసార సాగరము దాటుటకై ఈ దేహనౌకను బడసియున్నావు. ఈ శరీరము శిథిలము నందకున్నంతవఱకే దానిని సక్రమ మార్గమున నుపయోగింపుము." మఱియు నిట్లు గూడ దెలుపబడియున్నది. "శ్లో. యః ప్రాప్య మానుషం లోకం ముక్తిద్వార మపావృతం, గృహేషు ఖగవత్ సక్త స్తమారూఢచ్యుతం విదుః—దెఱువబడిన ముక్తిద్వారమువంటి మానవజన్మమును పొందియును నెవరు పక్షివలె గృహాసక్తులై యుందురో వారిని పండితులు ఆరూఢచ్యుతులు (ఉన్నతపదవిని పడసి యందుండి పడినవారు) అందురు.

ఆసక్తి, యనగా ధన జన గృహాదులయందో లేక తన శరీరమునందో గల యాసక్తి, ముక్తి ద్వారమును జేరినపుడును మనుజునకు నధః పతనమును గల్గించును. కావున వీనినన్నింటిని వదలి భగవత్పాదపద్మములందే యాసక్తి నలవఱచుకొనవలయును. అందే సమస్తానందములును అనుభవింపవలయును. ఇంతకంటె నుపాయాంతరము లేదు.

భగవంతు డత్యంత దయాస్వరూపుడు. ఆయనను జేరుటకై మన మొక యడుగు అభిముఖులమైనచో ఆయన మనవైపునకు వంద యడుగులు—వేయి యడుగులు—ముందునకు వచ్చును. ఇది ముమ్మాటికి సత్యము. ఇదంతయు కేవలము అనుభవమువలన దెలియదగినదియే కాని పలుకులవలన ప్రయోజనము లేదు. ఎవరయిన నొకరు సర్వాంతఃకరణముతో మనఃప్రాణముల నైక్యమొనర్చి 'ఓ భగవానుడా! నేను నీ శరణుజొచ్చితిని. నాకు దిక్కెవ్వరును లేరు' అని ప్రార్థింపగలిగినచో భగవాను డాతని తప్పక స్వీకరించును. ఇందు సందేహము లేదు. ఈ పలుకుల నూఱక పలుకుటయే కాదు. అనుభవించి మఱిపలుకవలయును.

శ్లో. త్వమేవ మాతా చ పితా త్వమేవ
త్వమేవ బంధుశ్చ సఖా త్వమేవ
త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ
త్వమేవ సర్వం మమ దేవ దేవ!
—ప్రపన్నగీత గాంధార్యుక్తి.

ఇట్లు మనము ప్రార్థించినచో భగవాను డాలకింపకుండునా? ఇట్లు ప్రార్థించువా రెవరనియే ప్రశ్న. కావుననే శ్రీ చైతన్యు డిట్లు పలికియున్నాడు: శ్లో. 'ఏతాదృశీ తవ కృపా భగవ న్మమాపి దుర్దైవ మీదృశ మిహాజని నానురాగః' *—ఓ ప్రభువా! నీ కింతటి దయ యున్నను నా కెట్టి దురదృష్టము. నీవు కృపామయుడవయినను నీపై నా కనురాగము కలుగ లేదుగదా!'' అనురాగము కావలయును. అనురాగమనగా ఆకర్షణ. అప్పుడే యేమయినను లభించును. ''ప్రభూ! నాకు అట్టి ఆకర్షణము ని''మ్మని ఆయనను బ్రార్థింపవలయును. అత్యంతముగా బ్రార్థింపవలయును. మనఃపూర్వకముగా భగవంతుని గొలువుము; ఆయన తప్పక ప్రసన్నుడగును. ఆయన ప్రసన్నుడైనపిదప అప్రాప్యవస్తు వెయ్యదియు నుండదు. హృదయమంతయు నా ప్రభుని భక్తిప్రేమలతో సంపూరితమగును. ఈ జన్మము సాఫల్యము నందును. అట్టిసమయమున ఇంద్రభోగములు సయితము తుచ్ఛములై కనిపించి సదానంద సుఖము ప్రాపించును.

ఇట్లు,
నీ కుశలమును నాకాంక్షించు
శ్రీ తురీయానంద

* నామ్నామకారి బహుధా నిజసర్వశక్తే స్తత్రార్పితా నియమితః స్మరణే న కాలః—ఓ భగవానుడా! నీ కన్నియో నామములు గలవు. ఆ యన్ని నామములయందును నీ సమస్త శక్తులను నిమిడ్చియున్నావు. ఈ సకల నామముల స్మరింప కాలనియమముగూడ లేదు. నీ కృప యిట్టిది. కాని నా దురదృష్టమేమో నీపై ననురాగమే యుదయించుట లేదు.

# శ్రీ వాసుదేవ మననము

## ప్రథమ వర్ణకము

శ్రీ మాచిరాజు శ్రీరామకృష్ణ

(గతసంచిక తరువాయి)

వివర్తమనగా. — "అప్రచ్యుతపూర్వస్వరూపస్య (అవివేకతః) అసత్యనానాప్రకారావభాసః వివర్తః". తనయొక్క పూర్వ(యథార్థ) స్వరూపమునకు ఏవిధమైన మార్పుగాని లోపముగాని లేకపోయినను (అజ్ఞానవశమువలన) అసత్యమైన నానావిధ ప్రకారములుగ నవభాస (అనగా సాక్షాత్తుగ నక్కడలేని వస్తువులక్కడ ఉన్నట్లు తోచుట) వివర్తమనబడును. ఇందుకు ప్రమాణము. — "సతత్త్వతోఽన్యథాప్రథా వికార ఇత్యుదీరితః। అతత్త్వతోఽన్యథాప్రథా వివర్త ఇత్యుదాహృతః॥" (వేదాంతసారము) అసలు వస్తువుచెడి మార్పులను బొంది యన్యమైన మఱియొకవస్తువుగ పరిణామమును బొందుట వికారమనబడును. ఉ॥ "పాలు పెరుగగుట." అసలు వస్తువు చెడక మార్పులను బొందకయే అసత్యమైన అన్యవస్తువుగ దోచుట వివర్తమని చెప్పబడును. ఉ॥ "రజ్జ్వాదులు సర్పాదులుగ నవభాసించుట". ఇట్టి వివర్తము వస్త్వజ్ఞానమువలన గలుగును. అజ్ఞానమనినను మాయ అనినను, అవిద్య అనినను ఒక్కటియే. సద్వస్తువుయొక్క లేమిని భావించుటయు, అసద్వస్తువుయొక్క కలిమిని తలంచుటయుననెడి భ్రాంతికి గారణము అవిద్యయే.

బ్రహ్మ వివరరూపమైన అజ్ఞానాది ప్రపంచముయొక్క వినాశమనగా — వినాశము "ధ్వంస"మనియు, "బాధ" యనియు రెండు తెఱగులు. అందు ప్రత్యక్షములగు పదార్థములను ఖండించి కాని, కాల్చి కాని, మఱియునే క్రియచేతనైనగాని నశింపజేయుట మొదటిది. దీనికి 'ధ్వంస'మని పేరు. భ్రాంతిచే నొక వస్తువును మఱియొకవస్తువుగా గ్రహించి తరువాత వస్తుస్వస్వరూపజ్ఞానముచే నిజస్వభావమును గ్రహించుటచేత భ్రాంతిసిద్ధమైన వస్తువునకుగలుగు అస్తమయము (నాశము) రెండవది. దీనికి 'బాధ' యని పేరు. బ్రహ్మజ్ఞానమువలన, మాయకును మాయాకార్యమునకును గలుగు నాశ మిట్టిదియే అనగా 'బాధ'యే యని తెలిసికొనవలయును. మఱియు "నా ప్రతీతిస్తయోర్బాధః కింతుమిథ్యాత్వనిశ్చయః। నోచేత్సుషుప్తిమూర్ఛాదౌముచ్యేతాయత్నతోజనః॥" (పంచదశి. 6–13) మాయాకార్యము మాయామయమునగు జగజ్జీవరూపములయొక్క బాధయనగా ఆ రెండును స్ఫురింపక పోవుట కాదు. మఱేమన ఆజీవ జగద్రూపములు రెండును మిథ్యయనెడి భావనిశ్చయమే 'బాధ' శబ్దార్థమగును. ఇక్కడ

'బాధ' శబ్దమునకు స్ఫురింపమియని యర్థము గ్రహించినయెడల సుషుప్తి మూర్ఛాతూష్ణీం భావావస్థలయందు జీవరూప జగద్రూపమగు ద్వైతము స్ఫురింపమిచేత, తత్త్వజ్ఞానము సిద్ధింపకుండగనే జనులు అప్రయత్నముగనే ముక్తిని పొందవలయును. అట్లు సుషుప్తి మూర్ఛాద్యవస్థలయందు జనులు ముక్తినిబొందుటలేదు. కనుక మాయకును మాయాకార్యమునకును బాధయనగా ద్వైతము మిథ్యయనెడి దృఢనిశ్చయమే యగునుగాని స్ఫురింపకపోవుట కాదు. మఱియు "నామరూపాత్మక ప్రపంచే సత్యత్వబుద్ధ్యపగమ ఏవ కారణస్వరూపజ్ఞానజ్ఞానివృత్తిః। నివృత్తిర్నామనత్వనవభాసనం। ప్రపంచసత్యత్వబుద్ధినివృత్తిరేవ। జ్ఞానస్యఫలం అధిష్ఠానజ్ఞానం॥ ఇతిభాష్యే॥" నామరూపాత్మక ప్రపంచమునందు సత్యత్వబుద్ధివినాశమే ప్రపంచవినాశము. ప్రపంచనివృత్తియన ప్రపంచముయొక్క స్ఫురింపమికాదు. ప్రపంచము సత్యమనెడి బుద్ధి నివృత్తిమాత్రమే. అదియే ఆత్మజ్ఞానముయొక్క ఫలము. 'అధిష్ఠానజ్ఞానసిద్ధి' అని భాష్యవచనము. ఇందువలన జ్ఞానికి వ్యవహారలోపములేదు కాని అవ్యవహారము అభినివేశ పూర్వకమైన వ్యవహారముమాత్రము కానేరదని తెలియవలయును.

యమాసామాయా' . "యానవిద్యతే సాఽవిద్యా"=ఏది లేనిదో అది మాయ - అవిద్యయనెడి వ్యుత్పత్తిచేత మాయయొక్క కల్పితత్వము సిద్ధము. "నిర్గుణేకేవలే సాక్షాదాత్మనో యద్విపర్యయః। సైషాభగవతో మాయాయన్నయేన విరుధ్యతే॥" (భాగవతము.) అవ్యక్త నిర్గుణ పరబ్రహ్మమునందు దనకు విపర్యయముగా జననంబైన జ్ఞానమే విష్ణుమాయ యనబడును. "ఏతద్యోగేన పరమపురుషో జీవోభవతి॥" (ముద్గల. ఉ.) ఈ మాయాయోగముచేత పరమపురుషునకు జీవత్వము కలుగుచున్నది. ఆ విష్ణుమాయ యుక్తులచేత నిర్వచింపబడుటకు శక్యము కానిది. "అజ్ఞానంతుచ్ఛాప్యసతీకాలత్రయేఽపిపామరాణాం వాస్తవీచ। సత్త్వబుద్ధిర్లౌకికానామిదమిత్థ మిత్యనిర్వచనీయావక్తుంనశక్యతే॥" (సర్వసార. ఉ.) అజ్ఞానము కాలత్రయమునందును అలీకమగుటవలన శ్రుతిజ్ఞానముచేత తుచ్ఛము అనగా మిథ్యాభూతము. పామరబుద్ధిచేత వాస్తవము, లౌకికులయొక్క సత్త్వబుద్ధి అజ్ఞానమును ఇదమిత్థమని నిర్ణయించి వచియింపనేరకపోవుటంజేసి యుక్తిజ్ఞానముచేత అనిర్వచనీయము. "తుచ్ఛాఽనిర్వచనీయాచ వాస్తవీచేత్యసౌత్రిధా। జ్ఞేయామాయాత్రిభిర్బోధైశ్శ్రౌతయౌక్తికలౌకికైః॥" (పంచదశి. 6-130) ఈ మాయ శ్రౌతబోధ (జ్ఞానము) చేత తుచ్ఛము అనగా కాలత్రయమునందును అసత్తనియు, యౌక్తిక (యుక్తి సంబంధమైన) బోధ (జ్ఞానము) చేత అనిర్వచనీయమనియు; లౌకిక (లోకసంబంధమైన) బోధ (జ్ఞానము) చేత వాస్తవమనియు నీ ప్రకారము త్రివిధముగా దెలియదగినదగును. అది మహాద్భుతశక్తిగలది. అదెటన "నిద్రాశక్తిర్యథాజీవే దుర్ఘట స్వప్నకారిణీ। బ్రహ్మణ్యేషాస్థితా మాయా సృష్టిస్థిత్యంతకారిణీ॥" (పంచదశి. 13-86) జీవునియందుగల నిద్రారూపమగు (అవిద్యా) శక్తిఘటింప యోగ్యముకాని స్వప్నానుభవమును ఏప్రకారము సృజించుచున్నదో ఆప్రకారమే బ్రహ్మాశ్రితమై స్వాధీనమైయున్న అనిర్వచనీయమగు నీ మాయాశక్తి మిథ్యాత్వముగలదయ్యును, సకల జగత్సర్గస్థిత్యంతములను చేయుచున్నది. "స్వప్నేనియద్ఘటింపశ్యే

త్స్వమూర్ధ్నశ్ఛేదనం యథా। ముహూర్తేవత్స రౌఘంచ మృతపుత్రాదికంపునః॥'' (13-87) పురుషుడు స్వప్నమునందు ఆకాశగమనమును, స్వశిరశ్ఛేదనమును, ఒకముహూర్తకాలములో అనేకసంవత్సరసమూహమును, మృతులైన బంధుమిత్రాదుల పునర్దర్శనమును అను నిత్యాది దుర్ఘటముల నేప్రకారము చూచు చుండునో ఆ ప్రకారమే జాగ్రదవస్థయందు అచింత్య మాయాశక్తి కృతములగు వియదాది సకలజగత్సృష్టిస్థితిలయములను చూచు చున్నాడు. ''ఇదంయుక్తమిదం నేతి వ్యవస్థా తత్ర దుర్లభా। యథాయథేక్ష్యతే యద్యత్తత్తద్యుక్తం తథాతథా॥'' (13-88) స్వప్నావస్థయందలి అనుభవము యుక్తాయుక్త విమర్శనమునకు సరిపడక నిర్వచించుటకు ఎట్లు అశక్యమగుచున్నదో అట్లే మాయాపరికల్పిత వియదాది సమస్త ప్రపంచము నిర్వచించుట కశక్యమగును. ఎయ్యదెయ్యది ఏయే విధముగా జూడబడుచున్నదో అయ్యదయ్యది ఆయావిధముననే ఉచితమైయుండును. కనుక స్వప్నము అఘటనఘటనా సామర్థ్యవంతమగునని తెలియవలయును. ''ఈ దృశో మహిమాదృష్టో నిద్రాశక్తేర్యథాతథా। మాయాశక్తే రచింత్యోఽయం మహిమేతి కిమద్భుతం॥'' (13-89) పరిచ్ఛిన్నస్వభావుడగు జీవునియందుగల నిద్రాశక్తియే దుర్ఘటానేక కార్యనిర్మాణ సామర్థ్యముగలదై యుండగా, అపరిచ్ఛిన్న స్వభావుడగు పరబ్రహ్మము నాశ్రయించి స్వాధీనమైయున్న అచింత్య మాయాశక్తి సకల జగన్నిర్మాణాది సామర్థ్యముగలదగు ననుటయందాశ్చర్యమేమి? మాయాశక్తియొక్క ప్రభావము నూహింపశక్యముగాదనుటయందు ఆశ్చర్యములేదు. ''శయానే పురుషేనిద్రా స్వప్నం బహువిధం సృజేత్। బ్రహ్మణ్యేవం నిర్వికారే వికారాన్ కల్పయత్యసౌ॥''(13-90) నిద్రించుచున్న పురుషునియందుగల నిద్రాశక్తి బహువిధములైన స్వప్నములను సృజించుచున్నది. ఈ ప్రకారముగనే నిర్వికార పరబ్రహ్మమునందుగల ఈ మాయాశక్తియు ఆకాశాది నానావిధ కార్యవర్గమును కల్పించుచున్నదని తెలియవలెను. సహస్రశోమనో రాజ్యే వర్తమానే సదైవతత్। సర్వైరుపేక్ష్యతే తద్వదుపేక్షా నామరూపయోః॥'' (13 - 95) ఇచ్ఛామాత్రముచేత మనస్సునందు గల్పింపబడిన సామ్రాజ్యాదులన్నియు సర్వదా సర్వజనులచేత నెట్లుల నుపేక్షింపబడుచున్నవో అటులనే బ్రహ్మమునందు మాయాకల్పితమైన నామరూపాత్మక నిఖిలప్రపంచము ఉపేక్షణీయమని తెలియవలెను. ''క్షణేక్షణే మనోరాజ్యం భవత్యేవాన్యథాఽన్యథా। గతంగతం పునర్నాస్తి వ్యవహారో బహిస్తథా॥'' (13-96) మనోరథ రాజ్యాది విషయములు ప్రతిక్షణము నందును చిత్రవిచిత్రములుగా మార్పును జెందుచునే యుండును. గతములు గతములేయగును గాని పునరాగతములు కానేరవు. అటులనే జాగ్రదవస్థయందలి జగద్వ్యాపారముకూడ అనాదికాలమునుండియు నత్యంత విచిత్రముగ మార్పును జెందుచునే యున్నది. గతించినది మరల వచ్చుటలేదు. బాల్యావస్థ యౌవనదశయందు బొందబడదు. యౌవనావస్థ వార్ధకదశయందు బొందబడదు. గతించిన మాతాపితరులు మరల వచ్చుటలేదు. కనుక గడచినది తిరిగి రానేరదుకదా!. ''మాయామేఘో జగన్నీరం వర్షత్యేవ యథాతథా। చిదాకాశస్య నోహాని ర్నవాలాభ ఇతిస్థితిః॥'' (8-75) మేఘము జలమును వర్షించుచున్న చందమున

మాయ జగత్తును కల్పించుచున్నది. మేఘము యొక్కగాని తత్కృత వర్షముయొక్కగాని లాభనష్టములు ఆకాశమునకు లేని విధమున, మాయయొక్కగాని మాయాకార్యమైనజగత్తు యొక్కగాని సంబంధమైన లాభనష్టములు చిన్మాత్ర పరమాత్మ నెంతమాత్రము స్పృశింప నేరవు. ఇది వివేకియొక్క నిశ్చయము. "దైవీహ్యేషా గుణమయీ మమమాయా దురత్యయా। మామేవయే ప్రపద్యంతే మాయామేతాం తరంతితే॥" (గీ 7-14) 'దేవః' అనగా "కాలత్రయేఽపీతరానపేక్షయాఖండ చిదాత్మనా స్వయమేవ దీప్యతే ప్రకాశత ఇతి దేవః"=సూర్యాది ప్రకాశవస్త్వంతర నిరపేక్షముగ నిత్యమఖండ చిద్రూపమున త్రికాలములయందు స్వయముగనే ప్రకాశించు సదాత్మ దేవః అనబడును. అట్టి నిర్విశేష పరమాత్మ యందు, ఆకసమునందు నీలిమవలె ఆభాస రూపముతోనుండి, జలమునకు శైవాలమువలె నాత్మస్వరూపమునకు ఆవరణభూతమైన త్రిగుణాత్మికయగు మాయ దైవీయనబడును. ఇది పురుషులకు దురతిక్రమణీయమైనది. ఆత్మ సాక్షాత్కారజ్ఞానము వినాగా అన్యమైన ఉపాయాంతరములచేత నతిక్రమించుటకు నలవి కాదు కావున దుర్జయమైనది. ఇటువంటి దయిన మాయను తరించుటయందు ఉపాయ మేమియన.—ఫలాపేక్ష రహితముగ ఈశ్వరార్పణబుద్ధితో అనేక జన్మములయం దనుష్ఠింపబడిన విధ్యుక్త సత్కర్మ విశేషముచేత బరిశుద్ధాంతఃకరణులగుచు ఈశ్వరానుగ్రహము వలన సంప్రాప్తమైన వివేక వైరాగ్యాది చతుర్విధ సాధన సంపన్నులయి అంతట శ్రోత్రియుడును బ్రహ్మనిష్ఠుడునైన సద్గురుసన్నిధియందు శ్రద్ధతో తీవ్రముముక్షుత్వముతో తదేకనిష్ఠ గలవారై వేదాంత శ్రవణ మననములనుచేసి, నిర్గుణుడను, అద్వితీయాఖండైకరసమను అయిన పరబ్రహ్మమగు నన్ను (స్వాత్మను) కార్యాంతరముల కవకాశ మొసంగక, నిత్య నిరంతర నిర్వికల్ప సమాధినిష్ఠచేత ప్రపత్తి నొందియుండు అనగా విపరీత ప్రత్యయము కలుగకుండునట్లు సర్వదా స్వస్వరూపమున అనుసంధానము చేయుచుండు యతులు ('యే నిర్జితేంద్రియగ్రామా యతినోయతయశ్చతే ఇత్యమరః''=జయింపబడిన ఇంద్రియసమూహము గలవారు యతులు) మాత్రమే, సద్గురు ప్రసాదాతిశయముచేత సంప్రాప్తమైన నిరర్గళమగు పరావరైకత్వ (జీవబ్రహ్మైక్య) విజ్ఞానము చేతనే, ఆవరణ విక్షేపరూపమును, సర్వానర్థ మూలభూతమును, సత్త్వరజస్తమోగుణరూపమునైన విష్ణుమాయను, మాయాకార్యమైన విపరీతదర్శన లక్షణము (మిథ్యాజ్ఞానము)ను తరించుచున్నారు. 'సర్వమిదమహం చ బ్రహ్మైవ'= ఈ సమస్త ప్రపంచము-నేను బ్రహ్మమాత్రమే' అనెడి నిరంకుశ అద్వితీయ బ్రహ్మ భావముతో విధ్వంస మొనర్చుచున్నారు. శ్రవణమాత్రముననే తమ్ము కృతార్థులనుగా భావించునట్టి తదితరులు మాత్రము విష్ణుమాయ నతిక్రమింపనేరరు. నిశ్శ్రేయస సుఖము నధిగమింపజాలరు. "దేహాత్మవత్ జ్ఞానం దేహాత్మ జ్ఞానబాధకం॥ ఆత్మన్యేవభవేద్యస్యస నేచ్ఛన్నపి ముచ్యతే॥" (వరాహ. ఉ. 2-25) దేహమే నేననెడి దృఢమైన జ్ఞానమువలె బ్రహ్మమే నేనని, దేహాత్మజ్ఞాన బాధకమైన బ్రహ్మాత్మైక్య విజ్ఞానము ఏపురుషునకు స్వాత్మయందే దృఢతరముగ ననుభూతమగునో ఆమహాత్మునకు అయాచితముగనే ముక్తి గలుగును. 'అహమేవ పరం బ్రహ్మ వాసుదేవాఖ్య మవ్యయః

ఇతిస్యాన్నిశ్చితోముక్తో బద్ధ ఏవా న్యథా భవేత్॥'' (వరరుచి వచనము) అవ్యయవాసుదేవపరబ్రహ్మము నేనే అని స్థైర్యమునొందిన స్వానుభవజ్ఞుడు ముక్తుడగును. అన్యథాయగు నెడల బద్ధుడేయగును. కావున ''జన్మమృత్యుసుఖదుఃఖ వర్జితం జాతి నీతి కుల గోత్రదూరగం। చిద్వివర్తజగతోఽస్యకారణం తత్సదాఽహమితి మౌనమాశ్రయ॥'' (వరాహ. ఉ. 3-7) జననమరణ సుఖదుఃఖాది వికారవిరహితమును, జాతి నీతి కులగోత్ర వర్ణాశ్రమలింగాది భేదశూన్యమును, చిదాత్మయొక్క వివర్తరూపమైన జగత్తుయొక్క కారణభూతమును అగు ఆ బ్రహ్మము సదా నేనేఅని సద్గురుబోధిత వేదాంత శ్రవణ మనన నిదిధ్యాసనాభ్యాస జన్య జ్ఞానముచేత స్వాత్మానుభూతింబడసి సర్వదా నిర్వాసనా మౌనమునాశ్రయించి యుండుము. ''వాసనా తానవం బ్రహ్మన్ మోక్ష ఇత్యభిధీయతేః'' (మహోపనిషత్. 2-41) లోకవాసన, శాస్త్రవాసన, దేహవాసన యనెడి వాసనాత్రయ వినాశమే మోక్షమని పేర్కొనబడుచున్నది. ''అద్వైతేబోధితే తత్త్వే వాసనా వినివర్తతే॥'' (వరాహ. ఉ. 2-70) అద్వితీయాఖండైక రసతత్త్వము సద్గురునిచే సుబోధితమై అవ్యవహితముగ ననుభూతమయినదగుచుండగా తత్క్షణమే సమూలముగ సకల వాసనా విలయము సంభవించును. ''వాసనాక్షయ విజ్ఞాన మనోనాశా మహామతే। సమకాలంచిరాభ్యస్తాభవంతి ఫలదా మతాః॥'' (ముక్తిక. ఉ. 2-10) అనేకజన్మములయందు దభినివేశముతో అభ్యసింపబడిన వేదాంతశ్రవణ మనన నిదిధ్యాసనాభ్యాస పాటవమున వాసనాక్షయము స్వాత్మవిజ్ఞానము మనోవినాశమనను నీత్రికము నేకకాలమునందే ఫలప్రదమగునని శ్రుతిసమ్మతము.

ఈ ప్రకారము అధ్యారోప అపవాద క్రమముచే సద్గురుసన్నిధియందు వేదాంత శ్రవణాదికము నభ్యసించి ''బ్రహ్మవ్యతిరేకేణ కిమపి నాస్తి తద్బ్రహ్మాహమేవ = బ్రహ్మముకంటె భిన్నముగ వస్త్వంతరములేదు. అపరబ్రహ్మము నేనే'' అని బ్రహ్మాత్మైకత్వోపలంభము (అనుభవము)ను బొందిన స్వాత్మవిజ్ఞానియే జీవన్ముక్తుడు. ''జీవన్నేవసదాముక్తః కృతార్థో బ్రహ్మవిత్తమః। శివఏవ స్వయంసాక్షాదయం బ్రహ్మవిత్తమః॥'' (ఆత్మ. ఉ. 20) కృతకృత్యుడైన బ్రహ్మవిత్తముడు సశరీరుడైయుండియు సదా ముక్తుడే, ఈ బ్రహ్మవిత్తముడు స్వయం సాక్షా దఖండైకరస పరబ్రహ్మమే'' అనునిత్యాది సమస్త వేదాంత సిద్ధాంతము.

కృతకృత్యత్వమనగా.—''ఐహికాముష్మికవ్రాతసిద్ధ్యైముక్తేశ్చసిద్ధయే। బహుకృత్యం పురాస్యాభూత్తత్సర్వమధునాకృతం। తదేవ కృతకృత్యత్వం ప్రతియోగి పురస్సరం॥'' (అవధూత. ఉ. 10) బ్రహ్మవిధునకు తత్త్వజ్ఞానము సిద్ధించుటకుబూర్వము, ఇహమునందు, ఇష్టవస్తురాశియొక్క ప్రాప్తికొఱకును అనిష్టనివృత్తికొఱకును కృషి వాణిజ్యాది కర్మమును, మఱియు స్వర్గాది పుణ్యలోకములయందు సుఖప్రాప్తికొఱకు యాగోపాసనాది వైదికకర్మమును, మఱియు మోక్షసాధనమగు తత్త్వజ్ఞాన విజ్ఞానసిద్ధికొఱకు వేదాంతశ్రవణాదికమును బహువిధములుగా చేయదగినదై యుండెను. ఇప్పుడు అనగా తత్త్వజ్ఞాన విజ్ఞానసిద్ధ్యనంతరమన్ననో సాంసారిక ఫలేచ్ఛాభావము (లేమి) చేతను మఱియు స్వాత్మానందము సాక్షాత్క

రించుటచేతను ఆకృషి వాణిజ్య, యాగోపాసన, వేదాంతశ్రవణాదిక మంతయు జేయబడినట్లాయెను అనగా నికమీఁద ననుష్ఠింపదగిన కర్మమేదియు లేనందువలన జేయదగినదంతయు జేయబడినట్లాయెనని యభిప్రాయము. ఇదియే ప్రతియోగ్యనుసంధానపూర్వకమైన కృతకృత్యత్వము. "అను సంధ దేవాయమేవం తుష్యతినిత్యశః" (అవధూత. ఉ. 10) ఈకృతకృత్యతనుపొందిన జీవన్ముక్తుడు, ప్రతియోగి-అనగా విరుద్ధధర్మములుగలది – ప్రపంచము ననుసంధించుచునే (తలంచుచునే) నిత్యము నిరతిశయమైన నిరవధికానందము నొందుచున్నాడు. "కృతంకృత్యం కర్తవ్యం కర్మయేనసః కృతకృత్యః। బ్రహ్మవిత్కృతకృత్యోభవతీత్యర్థః॥" ఐహికాముష్మిక సుఖవ్రాతసిద్ధికొఱకును, మోక్షప్రాప్తికొఱకును కర్తవ్యమైన (చేయందగిన) కర్మమునంతను నిర్వర్తించి అప్రతిబద్ధమైన ఆత్మాపరోక్షసాక్షాత్కారజ్ఞానమునుబొందిన జీవన్ముక్తుడే కృతకృత్యుడగుచున్నాడు.

జీవన్ముక్తుడనగా.—"యోజాగ్రతిసుషుప్తిస్థోయస్యజాగ్రన్నవిద్యతే। యస్యనిర్వాసనోబోధస్స జీవన్ముక్త ఉచ్యతే॥" (వరాహ. ఉ. 4-23) ఏబ్రహ్మవేత్త సుషుప్తి సదృశమైన వృత్త్యుపశాంత్యవస్థయందున్నవాడైనను అజ్ఞానమునను౦డక సంవిదభిన్న సుఖము నాస్వాదించుచుండునో, ఏయాత్మతత్త్వజ్ఞానికి, సర్వలోకసాధారణమైన జాగ్రద్రూపమగు జగద్వ్యవహారదశయుండదో ఏ బ్రహ్మవిదుని బోధ (జ్ఞానము) లోక–దేహ–శాస్త్ర వాసనలనెడి వాసనాత్రయ శూన్యమైనదో అటువంటి స్వస్వరూప విజ్ఞాని జీవన్ముక్తుడని చెప్పబడుచున్నాడు. అనగా ఆత్మయొక్క యథార్థస్వరూపమైన అద్వితీయాఖండైకరస (చిదానంద) జ్ఞానము సాక్షాదపరోక్షముగ సిద్ధించుటవలన ఆబ్రహ్మము తెలియబడక పోవుటయనెడి అజ్ఞానము బాధింపబడుటమూలమున స్వాత్మతత్త్వము స్వయముగ ననుభూతమై అందువలన అనాద్యజ్ఞానము, అజ్ఞానకార్యమైన సంచితకర్మము, సంశయము, విపర్యయము. (విరుద్ధజ్ఞానము) సంశయ–విపర్యయములు ప్రవర్తించుచున్నంతపర్యంతము జ్ఞానము పూర్ణముకానేరదు) మొదలైన విపరీతభావములన్నియు బాధింపబడినవి యగుచుండగా అఖిలబంధములనుండి విడువబడి యనవరతాత్మనిషంగలిగియుండు ఆత్మజ్ఞాని జీవన్ముక్తుడు.

ఇది ప్రథమవర్ణకము

శ్లో. ఇదం శరీరం పరిణామపేశలం, పతత్యవశ్యం శ్లథసంధిజర్ఝరం
కిమౌషధైః క్లిశ్యసి మూఢదుర్మతే, నిరామయం కృష్ణరసాయనం పిబ.

—ముకుందమాల.

ఓ మూఢా! ఈ శరీరము బాల్యము కౌమారము మున్నగు మార్పులవలనను సంధి దోషములవలనను దుర్బలమయినది. అవశ్యము నశించునది. ఔషధముల సేవించుచు నేల కష్టపడుచున్నావు? ఏ రోగమును జేరనీయని శ్రీకృష్ణనామామృతమును పానముచేయుము.

# పవిత్రమాత శ్రీ శారదాదేవి

శ్రీమతి డాక్టర్ రామకృష్ణమ్మ, ఎం.బి., బి.ఎస్.

[చెన్నపురి శ్రీ రామకృష్ణ మఠమున 20-12-51 న జరిగిన 99-వ శ్రీ శారదాదేవి జన్మదినోత్సవ సంవర్భమున శ్రీ రామకృష్ణమ్మగారు ఉపన్యసించిన యుపన్యాసమే యీ వ్యాసము. —సంపాదకులు]

శారదాదేవి భరత రమణీమణులైన సీత రుక్మిణి రాధ—వీరి అవతార స్వరూపము. ఆమె స్త్రీ సముదాయమును, శరీరవాంఛా బంధములనుండి విడదీసి, కేవలము మనమును బుద్ధిని ఆధారములుగా పెట్టుకొని, భగవంతుని సన్నిధానమును చేరు మార్గమునకు ఆదర్శప్రాయురాలుగా నుండెను. ఆమె ఈరామకృష్ణ పథమునకు మకుటము. ఆమె అనుగ్రహమును పొంది వివేకానందస్వాములవారు అమెరికాకు పోయినారు. తాత్విక విషయములలో సందేహమును తీర్పవలెనన్న ప్రసిద్ధిచెందిన ఈశ్వరకోటిలోనివారగు శ్రీ వివేకానంద, బ్రహ్మానంద, శారదానందస్వాములవారలు ఆమెదగ్గఱకు పరుగెత్తుచుండిరి. నాగమహాశయుడను గృహస్థు, గురుమహారాజుగారి (శ్రీరామకృష్ణుల) ప్రేమపాత్రుడు; అనుగ్రహ అనుకంపమును పొంది, జీవితమును గడిపిన గృహస్థ సన్న్యాసి. "తల్లి తల్లే, తండ్రికంటె తల్లి అనుగ్రహము గొప్ప" అనుచు ఆమె దయాపూర్వకముగా ఇచ్చిన వస్త్రమును శుభదినములలో తలకు కట్టుకొనుచుండెను. ఆమె పత్ని, సన్న్యాసిని, గురువు, పవిత్రస్వరూపము. ఈ పవిత్రురాలిని మనము ప్రేమించిన, భజించిన, సేవించిన, స్మరించిన, పవిత్రులము కాగలము. గంగాజలమున స్నానముచేసిన, మనము అయత్నముగనే పవిత్రుల మవుదుము. అదేవిధముగ మనము పవిత్రమైన శ్రీ శారదాదేవిని స్మరించిన అయత్నముగా మంచిమార్గమునకు జేరుదుము.

ఈమె జీవితము హిందూ స్త్రీల సాధారణ జీవితము. కలకత్తాసమీపముననుండు జయరాంబటి అను ఒక చిన్నగ్రామములో ఒక సాధారణ బ్రాహ్మణుల ఇంటిలో ఈమె జనించినది. ఆమె తండ్రి రామభక్తుడు రామచంద్ర ముఖర్జీ, తల్లి శ్యామసుందరీదేవి; గ్రామదేవతలు సింహవాహినిని జగద్ధాత్రిని పరమభక్తిచే సేవించుచుండెను. శ్రీ శారదాదేవిని గర్భము ధరించినప్పుడు, ఆమెకు శుభస్వప్నములు లభించుచుండెను. ఆమె తండ్రి చాల దయాళువు. ఒకప్పుడు వారి గ్రామములో క్షోభము సంభవించెను. అప్పుడు, ఈమె తండ్రి సేకరించిన బియ్యమును, గంజిరూపముగా లేదనకుండ ఎందఱికో అన్నదానము చేసెను. ఇంటివారలకుకూడ అదే గంజి ఆహారము.

ఈ సాధారణ కుటుంబజాతయగు శారదాదేవికి చదువు రాదు. ఆమె చిన్నప్పటినుండి

తల్లికి వంటపనులలో సహాయపడుచుండెను. ఆవులకు గడ్డికొఱకై పోయి, గడ్డి కోయుచుండెను. పొలములోనుండు కూలీలకు, ఆహార పదార్థముల మోసికొనిపోవుచుండెను. తోడి పిల్లలతో తగవులు పెట్టుకొనక, వారి తగవులకు తీర్పు చెప్పుచుండెను. ఆమె మట్టిబొమ్మలను, కాళి, లక్ష్మిని బిల్వపత్రములచే, అతి భక్తితో, అతిప్రేమతో పూజించుచుండెను. ఆమె బడికి పోలేదు. ఆమె గురుమహారాజైన శ్రీ రామకృష్ణులుండిన దక్షిణేశ్వరమునకు వచ్చిన తరువాత చదువ నేర్చుకొనెను. ఆమె ఎప్పుడును వ్రాయలేదు. మన హిందూదేశమున, చదువువలననే నాగరికము, జ్ఞానము ఉత్తమస్త్రీల లక్షణములు లభించుననే అభిప్రాయము ఎప్పటికిని లేదు. మన పూర్వులు గొప్పగొప్ప అభిప్రాయములు, ఆదర్శములు, మానసిక భావౌన్నత్యము, బుద్ధి, తేజస్సు, అందఱకు సులభముగా లభించు మార్గములు కనిపెట్టినారు. దేవాలయమునకు పోవుట, హరికథలు వినుట, కాలక్షేపములు, భక్తిభావమును పురికొల్పు పురాణకథల వినుట, ఇవన్నియు ఆడపిల్ల పెఱుగునప్పుడు మనస్సును స్థిరపరుచుటయందు ఆమె భావములు పరిశుద్ధి నందుటయందు అతిముఖ్యములు. శ్రీ శారదాదేవి, ఉన్నత మనోభావములకు నిధానము. ఆమె భక్తి, ఆమె ఉన్నతశీలము, ఆమె ఓపిక, శరీరవశంవృత్తి—వీనియందు భక్తిసమేతులైన, ఆమె తల్లితండ్రుల నడవడియే ఆమెకు ఆనవాలుగా నుండెను.

జయరాంబాటిలో ఆమె పెరుగుచున్నప్పుడు, కలకత్తాదగ్గఱ గంగాతీరమున నుండు దక్షిణేశ్వరపు గుడియందలి పూజారి శ్రీ రామకృష్ణులు, పరమాత్ముని దర్శనాన్వేషణాపరాయణులై, సదా జపతపములలో మునిగి తేలుచుండెను. అతనికి అప్పుడు 23 ఏండ్లు. అతడు కాళీదేవిని, "తల్లి తల్లి" అని సంబోధించడము, అన్నము ఆహారము వదలి, రేయింబవళ్లు ధ్యానమున గడపడము ప్రజలకు పిచ్చిచేష్టలుగా కనపడుచుండెను. తల్లితండ్రులు, స్వగ్రామమైన కమ్మరపుష్కరిణికి రప్పించిరి. ప్రపంచమున అనురాగము లేకుండుట, లోకవ్యవహారములలో ఏ విధమైన ఇచ్ఛ లేకుండుట చూచి, ఆ వింతమనస్సును లౌకికమార్గమునకు తిప్పుటకు సాధనము వివాహమని తలంచి, కన్యాన్వేషణము ప్రారంభించిరి. గురుమహారాజునకు తెలియకుండ ప్రయత్నములు జరిగినవి. అయినను సఫలము కాలేదు. వారి అభిప్రాయము ఈ జ్ఞానికి తెలిసి తల్లితో "నాకు నియమించిన కన్య రామచంద్ర ముఖర్జీ కన్య; జయరాంబాటిలో ఉన్నది" అని శ్రీ గురుదేవుడు పలికెను. ఆశ్చర్యమును చెంది గురువుగారి పెద్దలు అచ్చటికి వెళ్లి విచారించి పిల్లను కుదిరిచి వివాహమును నడిపిరి. అప్పుడు ఆమెకు ఐదేండ్లు. ఆమెకు ఏడేండ్ల ప్రాయమున గురువుగారు మఱల దక్షిణేశ్వరమునకు వచ్చిరి. శ్రీ శారదాదేవికి తన భర్త జ్ఞాపకమాత్రమే.

ఏండ్లు గడిచినవి; తల్లికి 18 సంవత్సరములు నిండినవి. ఆమెకు 14 సంవత్సరములప్పుడు, తన పెనిమిటిని కొంతకాలము చూచియుండెను. ఆయన దయ, దాక్షిణ్యము, శరీరవాంఛాసంబంధము లేని మాధుర్యము ఆమె హృదయమునకు ఆహ్లాదము కలిగించియుండెను. ఆమెకు అప్పటినుండి మనస్సులో శాంతి, ఆలోచనాశక్తి, సేవపై అనురక్తి, అపారమైన ఓపిక, ఆ చిన్నవయస్సులో సహజమై యుండెను. దయామయుడైన తన పెనిమిటి రప్పించి, కరు

ణించునని, ఎంతకాలమైనను గడపియుండును కాని, ఆమె పెనిమిటి పిచ్చిచేత అలయుచున్నాడన్న గ్రామస్థుల వదంతి విని, తన తండ్రి అనుమతిని చెంది, తండ్రి వెంబడిరా, దక్షిణేశ్వరమునకు బయలుదేరెను. ఆ కాలమున బీదలు కాలినడకనే కలకత్తాకు రావలెను. ఈ పవిత్రమాతకు, శారదా దేవికి, ఆయాసముచేత తెలివితప్పి జ్వరము వచ్చెను. అప్పుడు ఆమెకు ఒక వింత దర్శనము లభించినది. దేదీప్యమానమైన ఒక నల్లని యువతి ఆమె తలను చేతులను ప్రేమతో తడవెను. శారదా దేవి, నీ వెవరన "నేను నీ సహోదరిని. దక్షిణేశ్వరము నా ఊరు. నీకొఱకై, నీ భర్తను నేను దక్షిణేశ్వరమున నివసింపచేయుచున్నాను" అని అనెను. మరుచటిదినమున జ్వరము తగ్గగా, ఒక పల్లకిని ఏర్పాటుచేయించి ఆమెను దక్షిణేశ్వరమునకు పిలుచుకొనిపోయిరి.

ఆమెను చూచి, శ్రీరామకృష్ణులు ఎంతో ప్రేమతో ఆదరించెను. ఆమె ఆరోగ్యవిషయమై ఆమెను తండ్రివలె ఆలోచించెను. అప్పటినుండియు, ఆమెజీవితాంతము, అక్కడనుండిన తన అత్తగారికి, పెనిమిటికి, మనస్ఫూర్తిగా సేవ చేయుటయే జీవిత పరమావధిగా భావించి, కాలము గడిపెను. ఈ చిన్నవయస్సుననే, పవిత్రమాత, ధర్మస్వరూపిణి. అత్తగారు పిలువకముందే, ఆమె పరుగెత్తుకొనిపోవును. గురువుగారి గది సమీపమున "నహబత్" అను ఒక చిన్నయిల్లు ఉన్నది. పైన మిక్కిలి చిన్నగది. దానిలో అత్తగారు చంద్రాదేవి; క్రింద కూరగాయలు, కట్టెలు, వంటపాత్రలు, సామగ్రితో ఉన్న ఆచిన్న గదిలో శ్రీమాత. ఆమె మాటిమాటికి పైకి, అవసరముగా, పరుగెత్తుటచూచి, తన స్నేహితురాలు, మెల్లగా పోకూడదా అనగా; అత్తగారు పెద్దగొంతుచే పిలిచిన ఆమెకు గొంతు నొప్పికలుగునని పలుకుచు పిలువకమునుపే ఆమె ఆహారసదుపాయములు, శ్రీశారదాదేవి చూచుకొనుచుండెను.

అందమైన యువతి, పైన భార్య దగ్గరనున్నను గురుమహారాజునకు, మనోచంచలనమే లేదు. ఒక రోజు తల్లి "నేను మీకంటికి ఏవిధముగా కనబడుచున్నాను" అని అడుగగా వెంటనే "గుడిలోనున్న తల్లిని, నన్నుకన్న తల్లిని, నీలో చూచుచున్నాను. నీ స్త్రీస్వరూపము మాతృస్వరూపము" అని పలికిరి. పవిత్రమాత, వివాహితమైనను కన్యయే. ఆమె భర్త సన్న్యాసి. ఆమె సన్న్యాసిని. శరీరవాంఛారహితులు; అకాములు. ఆమెకు సంతానము లేదని, ఆమెతల్లి లోకసహజముగా విచారింప, గురుమహారాజు "ఆమెను 'తల్లి, తల్లి' అని సంబోధించు బిడ్డలు ఎందఱో రాగలరు. ఆమె పుత్రులు లోకహితులు" అని పలికెను. అటులనే మహారాజుగారి శిష్యులు, ఆమెశిష్యులు, ఇప్పటివఱకు రామకృష్ణమఠము నందలి సన్న్యాసులు, ఆమెను వారితల్లిగా భావించుచున్నారు. ఇక్కడి మనముకూడ, ఆమె బిడ్డలము.

ఆమె మనస్సు ఎప్పుడును పరమాత్మునిసన్నిధికి ఎగురుచుండెను. ఆమెకు, ఆమెభర్త వలన లభించినది తన మనోరథమునకు సరియైన జీవనము; లౌకిక జీవితముకాదు. భగవంతుని సన్నిధికి చేరుటకు తర్ఫీతులు, సమాధిరూపముగా సచ్చిదానందములో మునిగి తేలుట, ఆమె నేర్చుకొనెను. ఆమె లౌకిక జీవితము, సేవ, స్వార్థత్యాగము. పవిత్రమైన, కళంకములేని ఆమె మనోఆకాశము తెల్లనిది;

నలుపు కొంచెమైనను లేదు. తన భర్తగదిలో, ఆమె అప్పుడప్పుడు నిద్రించునది. గురుమహారాజును, ఆమెయు ఏవిధమైన శరీరవాంఛలు లేక, కాలముగడిపిరి.

కొంతకాలమైన తరువాత, ఆమె భర్త ఆమెను తల్లిస్వరూపమైన కాళీదేవిగాభావించి, ఒక ముఖ్యమైన పూజను "షోడశీ పూజను" నడిపించెను. అది కాళీమాతను కన్యగా భావించి, పవిత్రమైన ఒక కన్యను పూజించుట. ఆపూజలో, పవిత్రకన్య శ్రీశారదాదేవి, కన్య, దేవీరూపము. పూజారి ఆమెభర్త, గురుమహారాజు. ఆ పూజలో, శ్రీ శారదాదేవికి లోకస్మరణయే లేక సమాధిలోనుండెను. ఇద్దఱకు, ఆత్మసంబంధమైన ప్రేమ నిరూపమయినది. ఈ పూజవలన, ఈమె ఈ రామకృష్ణభక్తులకు, తల్లిస్వరూపమును ధరించినది. ఈమెనుండి, దేవీశక్తి వెలువడ ప్రారంభమయినది. ఇప్పటినుండియు ఈమె మానవమాత్రురాలు కాదు; దేవీస్వరూపిణి.

పతిసేవవలన, ముక్తిమార్గమును పొందిన భారతనారీమణులలో, ఈమె ఒకతె. ఈమె భర్త బుద్ధుడు, జీసను, చైతన్యదేవుడు శ్రీరాముడు, శ్రీకృష్ణుడు—ఈ అవతారపురుషుల వలె, ఒక అవతారపురుషుడు. అతని తేజస్సులో మెలగి, అనుసరించి, సేవించి, జపించి, శ్రీశారదాదేవి అన్ని తత్త్వములు నేర్చుకొనెను. గురుమహారాజు, తనబోధనలకు భావి ఆధారముగా, ఆమెను నిరూపించి, ఆమెకు అన్ని విధముల గురువుగానుండి, తనతో సమానురాలుగా చేసెను. ఇట్టి భర్తను భర్తగానోచుకొన్న పవిత్రమాతను, సాధారణ స్త్రీగా నెన్నుకొన్నను, మనము ఆమె సంస్కారములను ఇట్టివని తెలిసికొనవచ్చును.

ఆమె దక్షిణేశ్వరములో, 13 సంవత్సరములుండెను. ఆమె మూడుగంటలకు లేచి, గంగానదిలో స్నానముచేయుచుండెను. ప్రార్థన తరువాత, దినమంతయు వంటచేయుటలో గడుపుచుండెను. గురువుగారికి జీర్ణశక్తి తక్కువ. అతిజాగ్రత్తగా ఆమె ఆహారముల తయారుచేయుచుండెను. ఆమె అత్తగారిని, గురువుగా, తల్లిగా సేవించి ఆమెకు శుశ్రూష చేయుచుండెను. గురువుగారిని సేవించుచున్న శిష్యులకు, అతిథులకు, ఆమె వండుచుండెను. తల్లిప్రేమ అధికముగాన వివేకానందస్వాములకు, బ్రహ్మానందస్వామిగారికి, ప్రియమైన తినుబండముల తయారుచేయుచుండెను. గురువుగారు శిష్యులకు, ఎక్కువగా రొట్టెలిచ్చిన వారి సాధనలకు అడ్డు అని చెప్పిరి. ఆమె సమ్మతించక పిల్లలు కొద్ది రొట్టెలు అధికముగాతిన్న, తప్పులేదనెను. అప్పుడప్పుడు శిష్యురాండ్రు, గురువుగారి గదికి అన్నమును మోసికొనిపోయి వడ్డించుచుండిరి. ఆమె ఆ సమయమున, వారికి, సేవ భక్తిని లభింపచేసెను. అట్టి సమయమున, రెండు మూడు నెలలకు ఒకసారికూడ, ఆమెకు భర్తృదర్శనము లభించదు. ఒకగంటప్పుడు భుజించి, 3 గంటల వఱకు విశ్రాంతి తీసికొనును. మఱల వంటచేసి వడ్డించుచుండును. సదా దేవసంకీర్తనలు పాడుచుండును. శిష్యురాండ్రందఱు ఆమె దగ్గఱ శయనించుచుండిరి.

ఆ దయామయురాలు, స్త్రీలను, అన్ని విధములుగా క్షమించి, రక్షించి ప్రేమించుచుండెను. ఒక వైష్ణవి, గురువుగారిని హద్దుమీరి మనస్సులో కామప్రేమను, చవిచూడ, అనుమతిని కోరెను. గురువుగారు పరుషముగా, ఆమెను గది వదలమనిరి. అప్పుడు ఈ పవిత్ర

పత్ని, ఆవైష్ణవిని, తన గదికి పిలిపించి "అమ్మాయి, నీ తల్లిని నేనున్నాను. నీకు ముక్తిమార్గము కావలెనన్న ఇచ్చటకు రమ్ము. కఠినముగా మాటలాడినవారిదగ్గఱకు నీవు పోవలదు" అని పలికెను. ఇట్లు ఖండించిన గురువుగారు ఆమె అపారప్రేమను, గ్రహించి సంతసించెను. ఈమె భర్తకు బానిసకాదు. తన భావముల నిరూఢపఱచగలదు.

ఆమె పెనిమిటి, ఆమె మనస్సును కనిపెట్టి ఆమెను సంతోషపెట్టుచుండెను. ఆమెను ఎప్పుడును నొప్పించలేదు. ఆమెకు తలనొప్పి అనిన ఆయనకు బాధ. ఆమెను దేవీస్వరూపముగా, భావికష్టజీవుల, అజ్ఞానాంధకారమును పాఱద్రోలు తేజస్వినిగా ఎందఱకో దీక్షవలన, జ్ఞానదానముచేయు మాతృస్వరూపముగా అసాధారణవనిత సాధుశరీరములో అసాధారణ శక్తి ఇమిడి ఉన్నట్లుగా గ్రహించి అపారముగా గౌరవించెను. ఆమెకు, అన్నిమంత్రముల, దీక్షనొసగు రహస్యవిషయముల బోధించెను. ఎవ్వరును ఆమెను ఏమాట అనకుండ రక్షించెను. ఒకప్పుడు, అతని అల్లుడు హ్రిదె ఆమెను కఠినముగా మాటలాడ "హ్రిదే! ఆమె పడగ ముడుచుకొన్న పాము. ఆమె ఆగ్రహించిన బ్రహ్మాదులు భయపడవలసినదే" అని పలికెను. ఒకప్పుడు అందఱకు, తినుబండములను ఎక్కువగాపంచుట చూచి "ఈవిధముగా ఖర్చుచేయవచ్చునా" అని యడిగెను. ఆ ఉదారహృదయమునకు దెబ్బతగిలినది. ఆమె ముఖవైకల్యమునుచూచి, గురువుగారు చింతించిరి. ఒకప్పుడు, ఒక అపరిశుద్ధజీవితముచే కళంకితమైన ఒక ముదుసలి రాకను చూచి, గురువుగారు ఆమెతో మాటలాడ కూడదని శ్రీశారదాదేవితో చెప్పిరి. ఆమె వినక, ఎన్నోగంటలసేపు రోజు, మాటలాడుచుండెను. ఆమె ప్రేమాపారతను చూచి సంతసించి, ధిక్కరించినను ఆమెను గౌరవించెను. శ్రీరామకృష్ణులు ఆమెను ఎప్పుడును ఏకవచనమున సంబోధించలేదు. "మీరు" అను గౌరవవార్తనే ఆమె పిలుపున ఉపయోగించెను. ఆమె ఆయన ఆశయముల, ఆత్మతత్త్వమును గౌరవించి, స్వీకరించెను. ఇదియే ధర్మప్రేమ, ఆత్మప్రేమ.

గురువుగారి ముఖ్యములైన మాటలలో రెండుమాటలు "ధనమును స్త్రీని త్యజింపుడు" అనునవి. తల్లి ఆ రెంటిని "ధనమును కామమును త్యజించెను." ఒకప్పుడు ఒకభక్తుడు, పదివేలరూపాయలు తల్లిని, తన ఉపయోగమునకై, స్వీకరించమనెను. ఆమె నిరాకరించెను. ఆమె భగవంతుని శిష్యురాలు. ఆదర్శ హిందూవనిత.

ఆమె అప్పుడప్పుడు, తల్లిగారింటికి పోవుచుండెను. తండ్రి చనిపోగా, కుటుంబము బీదరికమునందెను. అప్పటినుండియు ఆమె చనిపోవువఱకు వారిని, అన్ని విధముల ఆదరించెను. తల్లిసహాయమునకై కష్టమైనపనులు—వడ్లుదంచుట మొదలగునవి ఆమె చేయుచుండెను. జగద్ధాత్రిపూజ, అను పూజను ఆమె కుటుంబమువారు చేయుదురు. అది ఆమె కష్టపడి చేయించెను. ఏలన దేవి కనబడి "నేను ఈఇల్లు వదలనా" అని శ్రీశారదాదేవిగారిని ప్రత్యక్షముగా అడిగెను.

ఒకప్పుడు ఆమె తల్లిగారింటినుండి, దక్షిణేశ్వరమునకు ప్రయాణమై వచ్చునప్పుడు, బాటలో నడవలేనందున అడవిలో సహచరులు, ఆమె ఇచ్ఛప్రకారమువదలి, ప్రక్క

గ్రామమునకు వెళ్ళిరి. ఇరువురు దంపతులు క్రూరులు బందిపోటు దొంగలు ఆమెను సమీపించిరి. ఆమె మాధుర్యము, వారి మనస్సుల మార్చెను. ఆమెను ఆరాత్రి, ఆదరించి మఱు సటిరోజు ప్రక్కగ్రామమున వదలిరి. వారు అప్పుడప్పుడు దక్షిణేశ్వరమునకు పోవుచుండిరి. ఆమె కనుచూపువలన వారి జీవితములు మాఱెను. పాపములు నశించెను. శ్రీచైతన్య దేవుని కృపవలన "జగాయి మాదాయి" అను నిరువురు దొంగలు జ్ఞానులయిరి. బుద్ధుని అనుగ్రహమువలన, వారకాంత అంబపాలి బౌద్ధ సన్యాసినిగా మాఱెను. పరమాత్ముని సేవ వలన, తిరుమంగై ఆళ్వారు తన పాపకృత్యముల వదలి, భక్తులయిరి. ఈ లోకమాత అనుగ్రహమునకు గుఱియైన దొంగలు, తమ జీవితమును మార్చుకొనిరి.

గురువుగారు మహాసమాధికి ముందు, 'కాన్సరు' అను రోగపీడితులై, కలకత్తాలో ఒక భాగమైన కాశీపూరునకు పోయిరి. అక్కడ ఆమె వారికి శుశ్రూషచేసెడిది. సదాచింతించెడిది. ఆమెకు విశ్రాంతి, రాత్రి 11 గంటల నుండి మూడుగంటలవఱకే. ఆమె పగలు ఒకరోజు ఆహారమును మోసికొని గురువుగారి గదికి పోయినప్పుడు, పడకపై వారు లేరు. లేవ లేని బడలిన శరీరముగల భర్త మైదానములో పరుగెత్తుట కట్టెచేతనుంట, కిటికీగుండ ఆమె చూచెను. కొంతసేపటికి వారురా, ఆమె ప్రశ్నించ, "నాశిష్యులు చెట్టుక్రింద పండ్లు తినుచున్నారు. ఆ చెట్టుక్రింద పాముకలదు. దానిని అదలించితి"నని శ్రీ గురుదేవుడు పలికెను. ఆ దివ్య లీలాదర్శనభాగ్యము, దివ్య జ్యోతులైన ఆమె నేత్రములకు మాత్రమే.

భర్త అనారోగ్యమునకు, చింతించి పరమేశ్వరుని ఆశీర్వాదమునకై, తారకేశ్వరుని దేవాలయమునకు వెళ్లి అన్నము నీరు వదలి ప్రార్థించెను. ఒకరేయి ఈశ్వరుడు సాక్షాత్కరించి "ఎవరు భర్త, ఎవరు భార్య, ఎవరు బంధువు" అని పలికెను. ఆమె మనములో నుండిన బంధము, మాయ, మాయమయినది. ఇంటికిరా ఆమెభర్త "తెలిసెనా, అంతయును మిథ్యకదా" అని పలికెను. ఆమె తన పెనిమిటికి, మహాసమాధి సమీపించెనని తెలిసికొనెను.

గురువుగారి నిర్యాణమయినది. అప్పుడు ఆమె ఏడ్వ గురువు ప్రత్యక్షమయి యిట్లనెను: "ఎందుకు ఏడ్పు; ఒక గదిలోనుండిన నేను ఇంకొకగదిలో నున్నాను." ఆమె గాజులు తీయవలెనని తీయునప్పుడు భర్త సాక్షాత్కరించి "వల"దనెను. ఆమె ఎఱ్ఱని అంచు తెల్ల చీరల ధరించెను.

శ్రీ రామకృష్ణులు నిర్యాణమునకు ముందు నేను దర్శించని, పుణ్యస్థలములను నీవు చూడుమనిరి. ఆయన మరణించిన 15 రోజులకు యోగానందస్వామి, అభేదానందులు, అద్భుతానందులు, గోలపు మా—వీరి సమేతురాలై పుణ్యతీర్థముల దర్శింప, బయలుదేరెను. కాశీ విశ్వనాథుని దర్శన సమయమున, మనము ఆహ్లాదమయమయ్యెను. ప్రసిద్ధి చెందిన, మహాయోగి దిగంబరరూపముననున్న, భాస్కరానందస్వామికి, ఆమె దర్శనము లభించినది. బృందావన మార్గమున గురుమహారాజు ప్రత్యక్షమయిరి.. బృందావనముననుండు పచ్చిక బయళ్లుగల ప్రదేశమున చరించునపుడు, ఆమె నిర్మల మనము, రాధాభావమునుచెంది, రాధ శ్రీకృష్ణుని దర్శనమునకు ఎటుల పరితపించెనో, అటులనే ఆమె మనము పరితపించెను.

వెంటనే గురుమహారాజు, ప్రత్యక్షమయి ఓదార్చిరి. మనము పరిశుద్ధముచెందకున్న, మహాత్ముల ఆత్మల తలంపులచే, నిండియున్న, ప్రదేశపు మహిమ, మానవులకు గోచరముగాదు. పావనభావనల ఆకర్షణమునకు, మూలము మన మనోదర్శనమే.

యమునాతీరమున, జపించుచు, సదా సచ్చిదానందమున మునిగియుండెను. అప్పుడు ఆమె ''పరమాత్మా? నేను ఇతరుల తప్పులను, ఎన్న కూడదు. అటువంటి తలంపులు, ఎప్పటికిని నామనస్సున లేకుండునట్లు చేయుము'' అని కన్నీటిచే ప్రార్థించెను. ఆమె తన సహచారిణి, యోగిన్‌మాతో ''యోగిన్ ఇతరుల తప్పులు చూచిన, నీకండ్లు అపవిత్రములగును. తప్పులను చూడవలదు'' అని చెప్పెను. ఆమె ఒకరోజు సమాధిలో నుండగా, యోగానందస్వామి ఆమెను ప్రశ్నింప ఆమె గురుమహారాజువలెనే, ప్రత్యుత్తరములు చెప్పెను. ఆమెకు తెలివి తెలిసినతరువాత గురుమహారాజు ''చిత్'' తనపైన నుండెనని చెప్పెను.

ఈ బృందావనముననే ఆమె తన తపస్సువలన శిష్యులకు జ్ఞానదానమును దీక్షారూపమున, ఇచ్చెను. దీక్ష అనగా, వ్యక్తిస్థితిని, సంస్కారమును, ప్రారబ్దమును బట్టి అతడు పరమాత్మను సంధించుటకు, గురువుగారు బోధించు మంత్రము. ఆమెకు గురుమహారాజుగారు స్వప్నములో ''యోగిన్‌కు (శ్రీయోగానందస్వామికి) దీక్ష నిమ్మని అతనికి తగిన మంత్రమిది'' యని నుడివిరి. ఆదేసమయమున యోగానందులకు స్వప్నములో ప్రత్యక్షమై—''నీకుదీక్షాదానము నేనీయలేదు. తల్లి దగ్గఱ స్వీకరింపుము'' అని హెచ్చరించిరి. ఆమె ఒకరోజు సమాధిలో యోగానందులకు దీక్ష అనుగ్రహించెను. బృందావనమునుండి వచ్చిన తరువాత తల్లి జీవితము అతి దీనస్థితిని చెందెను. ఆమెభర్తృగ్రామమైన కమరుపుష్కరమునకు వెళ్లెను. అక్కడ ఒకప్పుడు శ్రీరామకృష్ణులు ప్రత్యక్షమయిరి. ఆయన పాదముల నుండి ఒకనది తరంగములుగా ప్రవహించెను. శ్రీవివేకానందస్వామి ప్రేమానందులు బ్రహ్మానందులు—పలువురు భక్తులు అతనివెంబడినుండిరి. ఆమె 'గంగానది అతని పాదములనుండి జనించినది, అతడే శివస్వరూపము' అని తెలిసికొనెను. ఆమెకు డబ్బులేదు. ఆకుకూరలు తోటలో పండించి వండి గురుమహారాజుగారికి ప్రసాదముగా అరగించి ఆమె అన్నము ఉప్పులేని ఆకు మాత్రము, ఒక సంవత్సరము తినెను. గుడ్డలు చినిగెను. ఆమెకు నా అనువారు లేరుకదా అని ఒకసమయమున వ్యాకులపడ గురుమహారాజుగారు, ప్రత్యక్షమయి ఓదార్చిరి.

తల్లి అవస్థ ఆమెపుత్రులైన గురుమహారాజుగారి శిష్యులకు తెలిసి కలకత్తాకు రప్పించి ఆమెను పోషింప ఆరంభించిరి. వీరియందు శారదానందులు యోగానందులు ముఖ్యులు. యోగిన్‌మా ఆమెకు స్త్రీతోడు. అప్పుడు మాతకు 34 సంవత్సరములు.

(సశేషము)

ఓమ్ తత్సత్.

# దేవీ స్తవము

## శ్రీ ఆత్మానందస్వామి

(గత సంచిక తరువాయి)

ఇంచుకైన నాదు మొఱాల ƒ కించవేమి; మోయగానీకు నను భార ƒ మాయె నేని
కలఁడొకండు కార్యాకార్య ƒ కారణుండు; శయ్యడిగ్గి నన్నతని కం ƒ దియ్యవమ్మ. 74

రామకృష్ణాది బుద్ధులు ƒ ప్రేమఁ జూతు; రంతియే, మోక్షమీయలే ƒ రెంతకైన
గుడుచువారె జీర్ణముఁజేసి ƒ కొనవలె, శివ; వద్దు నాదారికడ్డు రా ƒ వద్దు పొమ్ము. 75

బాహ్య విజ్ఞానమునకు నే ƒ బాటుపడను; తండ్రి దర్శనమీయఁడు ƒ దానివలన
సర్వతోముఖజ్ఞాన వి ƒ జ్ఞాన మొదవఁ; దెరను తొలఁగించు మీశ్వరి ƒ కరుణతోడ. 76

దృష్ట మనుమానబంధ, మ ƒ తృప్తికరము; వినము దాని పూజింప తా ƒ మసముగాదె
జగము రజ్జు సర్పభ్రాంతి ƒ జనని, తెలిసె; తొలగుము తెరదీసి మఱుఁగు ƒ నిలువవలదు. 77

మూఢ విశ్వాసము విరోధ ƒ మూల మరయ; మతదురభిమాన మధమాధ ƒ మంబెయగును
సమరసస్వభావ మొదవె; ƒ శక్తి! నాకు; తెరను తొలఁగింపు మావలి ƒ కరుగనిమ్ము. 78

మనసునందు నీరూపము ƒ గనకయున్న; శివుని వీక్షింపలేరంద్రు ƒ సిద్ధ ఋషులు
గాలిఁబీల్చక జీవింప ƒ జాలనట్లు; జాలిగొని తెరదీసి న ƒ న్నేలు మంబ. 79

భీతి గర్వదురభిమాన ƒ భీర, దంభ; జంబుకసమూహముల్ తత్క్ష ƒ ణంబుఁ బాఱుఁ
జెవికి వేదాంతగర్జనల్ ƒ చేరినంత; దయను తెరదీయుమమ్మ నే ƒ తగినవాఁడ. 80

కంటినే మనోవాక్కాయ ƒ కర్మశుద్ధి; సాత్వికాహార నియమ ప్ర ƒ చార యుక్తిఁ
బడయకను, రాజయోగ, మ ƒ పాయ మంచు; భారమూని, గావుము నీ కు ƒ మారు నమ్మ. 81

అష్టవసు సమాయుక్తమై ƒ యలరు, విశ్వ; మయ చరాచర సంఘము ƒ మార్పుచెందు
నిత్యషడ్భావవైకృతిన్ ƒ నీవు బనుప; బంధములవిప్పి తెరువిమ్ము ƒ భద్రకాళి. 82

శుద్ధమిది, యశుద్ధంబిది, । సుకృతమిద్ది, వికృతమద్ది, ఫలంబిది । విఫలమద్ది
పాప పుణ్యంబు లేల నీ । పాలఁబడితి; నేకపాటల, తెరదీసి । యేలుమమ్మ. 83

ధర్మకర్మానుచరణము । ధ్యానమొసఁగె; దానిచే, నకర్మస్థితి । దాపరించె
ౖమసి' యనుచు గురుండు । దారిఁజూపె; తెరనుదీయవె యింద్రాక్షి । కరుణతోడ.

నిద్రలేని యగాధ స।ముద్రముద్ర; శాంతసహాన విశాలాంత । రాంతరంబు
దలఁప ముక్తిభావంబులె । దయఁదలంచి; తెరవొకటి చూపు కాళిక । మఱుఁగు 85

విగ్రహారాధన తొలుత । వెడలె, నిష్ట; దేవతాప్రార్థన జపముల్ । లావుమీఱె
తైలధారగ ధ్యాన వి।స్తరత యొదవె; దేవి, తెరువును కడసారి । తెరవుఁ జూపు. 86

మధువు లభ్యమౌ పట్టన । మట్టు మొత్త; తత్వమలవడు సత్సంగ । ధారణమున
నాకు నీ నామజపమె స।నాతనంబు; తెరను తెరువును తడవాయె । ధేనుకాంబ. 87

నీవు మేల్కాంచినప్పుడు । నిప్పులుఱుకు; నంట దివ్యమూలాధార । మందు, మేఘ
గర్జనల్ విజృంభించు, నా।కాల మందు; నంబ, తెరదీసి యావలి । కనుపు మమ్మ.

నీవు కన్నువిప్పినవేళ । భావమడఁగు; దృష్టి యంతర్ముఖంబగు । దేహమపుడు
కంపమొందు సడలిపోవు । గొంప మొదలు; భయము తీరెను తెరమెత్తు । భద్రకాళి. 89

అశనభోగభాగ్యాకర్ష । ణాతిశయము; గట్టిపెట్టి, యాత్మావలో । కనముఁ జేయు
నింద్రియాళి కెదురురాకు । మింతె చాలు; తెరను తెరువుము శైలజా । కరుణతోడ. 90

సూక్ష్మమందున స్థూలము, । సూక్ష్మరూపు; కారణంబునందున, మహా । కారణంబు
నందు కారణం బిమిడి స । మాధి నిలుచు; నంట, యాదవి తెరదీయు । మమ్మ వేగ. 91

దినములు గడచుచుండె సం । దేహమేల ?; మాను మెగతాళి, నేటితో, । జ్ఞాననేత్ర
మొకటి నాసికాగ్రముననె । యున్నదంట; దాని తెరువుము కాళిక । దయదలంచి. 92

నిష్ఠురోక్తులాడితినని । కష్టబెట్టు; కొనకు, మనసులో నిబ్బంది । కోలఁదిఁ దూల
నాడినాడ, నీ యనుఁగుఁ గ । న్నాడగానె; కరుణఁ దెరదీసి రక్షించు । కాళికాంబ. 93

నీ చరణసరోజములందు । నేను పూర్ణ; దర్పధనమనఃప్రాణ స । మర్పణంబు
జేసి దాసుఁడ నగుచు నీ । చింతజేయు; వాఁడ, యమున రక్షించు నీ । వాడనమ్మ. 94

అంబ, 'జాతస్య మరణం ధ్రు । వం'బె' గంటి; 'పునరపి జననము,' మఱియు । 'పునరపి మర
ణంబు' నే నొల్ల, నీ చర । ణంబులాన; వినతు లొనరుతు, నావలి । కనుపు మంబ. 95

దుష్టు డపకారములుచేయు । దోసకారి; కుత్తమోత్తముఁ డుపకృతు । లొనరఁజేయు
ఉభయనైసర్గికములవి । అభము శుభము; లేల, కాళి యావలికి పో । నియ్యవమ్మ. 96

మధుకరముఁ దిని తనివొంది । మనసునందు; దుఃఖ మావంత లేక, యే । త్రోవఁ బోక
హాయి వేదాంత వనవిహా । రాప్తి నలరు; చుందు దయఁజూడు మంబ ధ । న్యుండ నగుదు. 97

పత్త్రిపుటముగఁ జేకోయి । బరచి యొడలు; గప్పి జీర్ణాంబరములచే । గఠినభూమి
నూఱడిల్లి, చెట్ల మొదళ్ల । నూరకుబ్బు; చుందు దయఁజూడు కాళి ధ । న్యుండనగుదు. 98

కళ్లెములతో విషయముల । గట్టి చింత; రేవగలుఁ బరమాత్మ నం । దే వెలార్చి
యాత్మలోనఁ బూర్ణానంద । మంది పొంగు; చుందు, దయఁజూడు గంగ ధ । న్యుండ నగుదు. 99

స్థూల సూక్ష్మకారణ దేహ । లీలలఁ గని; సరకుచేయక బుద్ధిని । పరమునందె
లగ్నమొనరిచి హాయి నా । లక్ష్యమందు; నుందు దయఁజూడు దేవి ధ । న్యుండ నగుదు. 100

మోక్షదాయకమైన బ్ర । హ్మాక్షరముల; నాత్మ నిడి 'అహం బ్రహ్మాస్మి' । యంచు నేను
చేత నక్షయపాత్రతో । స్వేచ్ఛఁ జనుచు; నుందు దయఁజూడు దుర్గ ధ । న్యుండ నగుదు. 101

తైలధార నీ నామంబు । స్తవముఁ జేయ; నఖిల వేదాంతశాస్త్ర ర । హస్యమెల్లఁ
గర్మయోగులు జ్ఞానులు । గాంచు సరణి; గూర్తువట కాళికాంబ నా । కోర్కె దీర్చు. 102

కావ్యపఠనమందును, వర్త । కంబునందు; తర్కమందును, గృషియందు । దగిలియున్న
యనువుగాదు నిదిధ్యాస । నంబు, వాని; దెలిసి వర్జించితిని తెర । దీయు మంబ. 103

ఆదిమధ్యాంతశూన్యుని । నప్రమేయు; సచ్చిదానందమయుని, న । చలుని, శివుని
వేదముల కొలనున్న స । ర్వేశ్వరుని, య; నుగ్రహముతోడఁ జూపవే । యుగ్రకాళి. 104

పావనుండు శ్రీకొత్త లం । కావధూత; సుతుఁడు, సామి యాత్మానందు । హితముగోరి
పతితపావని శాశ్వత । పదము నిమ్ము; తెరను తెరువుము చండిక । కరుణతోడ. 105

ఓమ్ శాంతిః శాంతిః శాంతిః.

# సర్వధర్మ సమన్వయమే మతాదర్శము

రచయిత :
శ్రీ వివేకానందస్వామి

అనువాదకుడు :
శ్రీ పిన్నింటి సుబ్బారావు

ఈ యింద్రియమయ జగత్తు, ఈ విజ్ఞాన జగత్తుయొక్క ఆద్యంతములు వాచామగోచరుడగు పరమేశ్వరుడే యని గ్రహింపవలయును. ఈ యాత్మానాత్మ వివేకమే మతమునకు పునాది. మతము ఇంద్రియాతీతస్థితియందావిర్భవించును. తర్కమునకును నిశ్చయజ్ఞానమునకును అది అతీతస్థితి. ఇంద్రియాతీతుడగు ఆ పరమేశ్వరుని గ్రహించు దివ్యస్మృతియే మతము. ఈ పరిశోధన యనంతకాలము నుండియు జరుగుచున్నది. అండ, పిండాండములు ఒక తీరుగా గమనముచేయుచున్నవి.

మతములకు పునాది బాహ్యముగాక, అంతరంగమైయున్నది. మానవుని నిర్మాణమునందే మతమునకు పునాదిగలదు. మానవుడు తన మనస్సును, శరీరమును, ప్రాణమును, భావములను విడిచిపెట్టుట ఎంత యసాధ్యమో, మతమునుగూడ విడుచుట యంత యసాధ్యకార్యము. ఈ పునాదిపైననే యనేకమతములు ఏర్పడినవి. కాని వీనియందలి సమష్టితత్వమును విమర్శనకుశలురగువారు గ్రహింపగలరు.

సృష్టియొక్క యాద్యంతములు పరమేశ్వరుడే యగుచో ఆ పరమేశ్వరునకై ఏల కృషి చేయవలయును? ఈ యింద్రియమయ జగత్తుతో ఏల తృప్తి నొందరాదు? ఆహార నిద్రాదులతోడను, ఏదియో కొద్దిగా పుణ్యకర్మ చేసి యద్దానితోడను ఏల తృప్తిగాంచ గూడదు? ప్రపంచమునకే కొద్దియో మంచిని చేయుటయే మతము, అతీతవస్తువునకై ఏల యత్నము చేయవలయును?

ఈ కనబడు బాహ్యజగత్తు, ఇంద్రియాతీతమగు తత్వముయొక్క యంశమై యున్నది. ఆధ్యాత్మిక జగత్తుయొక్క బాహ్యస్వరూపమే యీ బాహ్యజగత్తు. ఏథెన్సు పట్టణమునందుపన్యసించుచు, సోక్రటీసు, గ్రీసు దేశమునందు పర్యటించుచున్న యొక బ్రాహ్మణునితో, మానవునియొక్క నిజతత్వమును గ్రహించుటయే చదువులలోకెల్ల చదువు అని నుడివెను. అంత నా బ్రాహ్మణుడు "దేవుని గ్రహింపనిదే, మానవుని దెలియుటెట్లు" అని ప్రశ్నించెను. ఈ జీవితమునకుగాని, యీ బాహ్యజగత్తునకుగాని యథార్థస్వరూపము నామరూపరహితుడగు పరమాత్మయే యని గ్రహింపవలయును. ఏ శాస్త్రమును మనము పూర్తిగా విమర్శించినను, స్థూలరూపమునుండి, సూక్ష్మతత్వములోనికి పరిణామమును పొందగలదు.

ఈ విధముగా మానవుడు భగవంతుని తత్వమును గ్రహింపవలసినవాడాయెను. ఈ ప్రస్తుతస్థితితో తృప్తినొందరాదా యనిన ఆవు, కుక్క మొదలగు పశువులవలె ఈ వర్తమాన స్థితితో తృప్తినొందరాదు. మానవునకును,

పశువునకును ఈ మత జిజ్ఞాసయే భేద కారణము. మతధ్యాస లేనిచో ఈ మానవజన్మ వృథా. జీవరాశియం దొక్క మానవునకే యూర్ధ్వదృష్టిగలదు. ఈ యూర్ధ్వదృష్టియే మతము, లేక మోక్షస్థానమును, మానవుని పరమావధిని చూపుచున్నది. నీవు ఎంత ధనమును దాచియుంచితివో, ఎట్టి దుస్తులను ధరించితివో, ఎట్టి గృహమందు వసించుచుంటివో దానిపై నీమోక్షస్థితి యాధారపడి యుండదు. ఈ మతమందలి యాసక్తివలననే, మానవజాతి యభివృద్ధిగొందగలదు.

మతమువలని ప్రయోజనమేమి? అది మానవునిదారిద్ర్యమును పోగొట్టగలదా? యని యడుగవచ్చును. ఇది చిన్నపిల్లలడుగు ప్రశ్నవంటిది. పాఠశాలయందుపాధ్యాయుడు చేయు శాస్త్ర ప్రయోగములనుగాంచి విద్యార్థి దీనివలన మాకు కొంత బిస్కత్తులు లభ్యమగునాయని ప్రశ్నించిన ఎట్లుండునో యారీతిగా, మతమును గూర్చి ప్రశ్నింపరాదు. మత జిజ్ఞాస మానవుని భూత, భవిష్యత్తు, వర్తమానస్థితులకు సంబంధించిన ధర్మమైయున్నది. అది శాశ్వత తత్వము. శాశ్వతతత్వమును ఐహికధర్మములతో తులదూపరాదు. శాశ్వతధర్మముతోడనే పోల్చవలయును. మతమువలన లాభముగలదు. అది మానవునకు శాంతిని చేకూర్చగలదు. ప్రస్తుత జీవితమునకు మతమే పునాది. మానవుని దేవునిగా చేయునది మతము. మానవసంఘమునుంచి మతమును తుడిచివైచిన, పశుగణమునకును, మానవజాతికిని వ్యత్యాసముండనేరదు. ఇంద్రియసుఖము మానవుని యాదర్శముగాదు. జ్ఞానమే యాతని యాదర్శము. ఇంద్రియ సౌఖ్యముకంటె విద్యానందము, అంతకంటె ఆధ్యాత్మికానందము గొప్పవి. ఇట్టి బ్రహ్మానందము మత జిజ్ఞాస ఫలితము. మిగిలిన యానందములు దీనిలో పాతికభాగమునకైనను సరిరావు.

ప్రపంచముయొక్క గమ్యస్థానమేది? ఎచ్చటను ఏదియును లేదా? ఒక ఋజురేఖను పొడగించినచో అతి వృత్తాకారముగా బయలుదేరిన స్థానమునకు వచ్చి కలియదా? అదేరీతిగా, మనము భగవంతునియందు జనించియనంతకాలమునకు ఆయననే చొచ్చుచున్నాము.

మతధర్మపథమునందు క్రొత్తవిషయముల కనుగొనవలసిన పనిలేదు. వివిధ ధర్మములయందుగల సమష్టి తత్వమును గ్రహించుటయే జ్ఞానము. సమస్తమైన పదార్థములయొక్క మూలతత్వమొక్కటియేయని గ్రహించుటయే మత జిజ్ఞాసయొక్క ఫలితము.

పూర్వమునుండియు, ఈ మూలతత్వమును నరయుటయందు హిందువులు చాల పరిశోధనలుచేసి దిగ్విజయమునుగాంచియుండిరి. కపిలుని సాంఖ్యసిద్ధాంతము, వేదాంతుల అద్వైతతత్వము ఈ పరిశోధనా విజయ స్తంభములే.

# తెలుగు భాషా సమితి, మద్రాసు

తెలుగు భాషా సమితి యాజమాన్యాన ఏర్పడిన సంస్కృతి సమితి ౧౯౫౯ సంవత్సరం డిశంబరు నెల ౨౨, ౨౩ తేదీలలో రాజాజీ హాలులో జరిపిన పత్రికల ప్రదర్శనం, సమావేశాల సందర్భంలో సమర్పించిన సంక్షిప్త పరిచయ నివేదిక యిది.

తెలుగు భాషా సమితి సంకల్పించిన కార్య కలాపములలో ప్రధానమయినది తెలుగు విజ్ఞాన సర్వస్వ నిర్మాణం. ఇదివరకున్న విజ్ఞాన సర్వస్వములు సాధారణంగా అనుసరిస్తున్న అకారాది క్రమపద్ధతి గాక విషయానుక్రమ పద్ధతిని ఈ విజ్ఞాన సర్వస్వము ప్రకటింపబడుతుంది. ఈ పద్ధతివలన ఒక్కొక్క శాస్త్రము నకుగాని, ఒక్కొక్క కళకుగాని సంబంధించిన అంశములన్నీ ఒక్క సంపుటమందే ఉండుట కవకాశం ఉంటుంది. ఈ విధంగా విజ్ఞాన సర్వస్వం మొత్తం పన్నెండు సంపుటాలుగా వెలువడగలవు. ప్రతి సంపుటం డబుల్ క్రౌన్ ఆక్టేవో సైజులో వేయి పేజీలలో ఉంటుంది.

"చరిత్ర - రాజనీతి" సంపుటం, "పదార్థ విజ్ఞాన - రసాయన" శాస్త్రాల సంపుటం, "ఆంధ్ర" సంపుటం క్రమరీతిని వెలువడ గలవు.

## "చరిత్ర - రాజనీతి" సంపుటము

ఈ సంపుటము ముద్రణమునకు సిద్ధముగా నున్నది. దీనిలోనికి కావలసిన చిత్రములు, దేశ పటములు అన్నీ తయారుగా ఉన్నవి. కాగితము ఇంకా దొరకనందువల్ల దీని ముద్రణము ప్రారంభము కాలేదు. కాగితము వచ్చిన వెంటనే ముద్రణము ఆరంభము కాగలదు.

ఈ సంపుటము రెండు భాగములుగా ఉండును. మొదటి భాగములో సంక్షిప్తముగా ప్రాచీనకాలమునుండి నేటివరకు గల చరిత్రము— రాజనీతి పరిణామమున్ను ఉంటవి. ప్రపంచ చరిత్రకున్ను, రాజనీతి పరిణామమునకున్ను సంబంధించిన అనేక ముఖ్యవిషయాల వివరణములు రెండవ భాగములో అకారాది క్రమమున ఉంటవి.

## "పదార్థ విజ్ఞాన - రసాయన శాస్త్రముల" సంపుటము

ఇందు విషయము పదార్థ విజ్ఞాన - రసాయన శాస్త్రముల పరామర్శ. గ్రంథ విస్తృతి ౧౦౦౦ పుటలు. విషయము రెండు భాగములుగా విస్తృతమై యున్నది. అందు మొదటిది, ఈ రెండు శాస్త్రముల సంక్షేపావలోకనము గలది. ౧౫౦ పుటల భాగము. ఇది తయారై ముద్రణకు సిద్ధముగా నున్నది. రెండవది. అకారాది క్రమముగా ఈ రెండు శాస్త్రములందలి ప్రత్యేక విషయముల వివరణముగలది. దీని వ్యాప్తి ౮౫౦ పుటలు. ఇందు పదార్థ విజ్ఞాన శాస్త్ర భాగము అకారాది క్రమమున వర్గీకరించబడి అచ్చునకు సిద్ధముగా నున్నది. రసాయన శాస్త్రములో అకారాది క్రమ విషయము సంపాదితమై వర్గీకరణ విధానములో

నున్నది. ఇదికూడ కొద్దికాలములోనే పూర్తి కానున్నది.

## "ఆంధ్ర" సంపుటము

ప్రధానముగా ఇది ఆంధ్ర సంస్కృతికి సంబంధించిన సంపుటము. ఈ సంపుటము కూడా రెండు భాగాలుగా ఉంటుంది. మొదటి భాగములో విశాలాంధ్రదేశపు నైసర్గిక స్వరూపాదులు, శీతోష్ణస్థితి, పర్వతములు, నదులు, సరస్సులు, ఖనిజ, వన, జయసంపదలు, జాతులు, పరిశ్రమలు, వర్తక వ్యాపారములు, వ్యవసాయము, విద్య, వైద్యము, వాఙ్మయము, భాష, కళలు, చరిత్ర మొదలైన సమస్త విషయాలను గుఱించి తెలుపబడును. వాఙ్మయము, భాష, కళలు, చరిత్ర, వ్యవసాయము, పరిశ్రమలు, వర్తక వ్యాపారాదులను గురించి చాలా ప్రాచీనకాలమునుంచి ఇప్పటివరకు ఆయా విషయాలలో కలిగిన పరిణామ వికాసములు సంగ్రహముగా వివరింపబడును. రెండవ భాగములో విశాలాంధ్రదేశపు జిల్లాలు, పురుషులు, దుర్గములు, పండుగలు, మతములు, విశ్వవిద్యాలయములు, పుణ్యక్షేత్రములు మొదలైన వాటిని గురించిన సంగ్రహ వివరణము ఉంటుంది. ఆయా విషయాలలో కృషి చేసిన సమర్థులచేత వ్యాసములు వ్రాయబడుచున్నవి.

## సంస్కృతి సమితి

తెలుగు భాషా సమితి విజ్ఞాన సర్వస్వ ప్రచురణతోపాటు ఆంధ్రుల సాహిత్య, కళాభివృద్ధికి బహుముఖాల తోడ్పడ నిశ్చయించుకొన్నది. సంస్కృతి రంగంలో చైతన్యాన్ని ప్రబోధింపజేయుటకు ఒక సంస్కృతి సమితి—కల్చరల్ కమిటీ—భాషా సమితి యాజమాన్యాన ఏర్పడినది. సాహిత్యానికి, కళకు సంబంధించిన వివిధ రంగాలలో నూతన జాగృతిని కల్పించుటకు ఈ కమిటీ పనిచేయగలదు. ఈ శాఖ సంస్కృతి సభల సమావేశాలు జరిపి సంస్కృతిని పోషించు ముఖ్య విషయాలను గూర్చి చర్చలు జరిపించుట, ప్రదర్శనములు ఏర్పాటుచేయుట మొదలైన కార్యప్రణాళికను కూడ అనుసరింపగలదు.

తెలుగు భాషకు, సారస్వతమునకు, సంస్కృతికి సంబంధించిన చిత్రాలు, పట్టికలు, గ్రంథాలు మొదలైన పరికరాలు ఈ ప్రదర్శనాలలో ప్రదర్శింపబడగలవు.

ఈ ఉద్దేశాలను పురస్కరించుకొని తెలుగు పత్రికల ప్రదర్శనం జరిపించుటకు, పత్రికలకు సంబంధించిన విషయాలను గూర్చి ఆయా శాఖలలో సమర్థులైనవారిచే ఉపన్యాసములను ఇప్పించుటకును మొట్టమొదటగా తలపెట్టబడినది.

ఆధునిక సంస్కృతి వికాసానికి పత్రికలు పట్టుగొమ్మలు. మన దేశంలో జాతీయభావ ప్రాదుర్భావంతోపాటు పత్రికలుకూడ అవతరించినవి. మన పునర్నిర్మాణ దశలో పత్రికల ప్రాముఖ్యం అగణ్యమైనది.

కావున, ఏతద్విషయాలన్నిటిని చక్కగ అవగాహన చేసికొనుటకుగాను, ఈ పత్రికల ప్రదర్శనం, మహాసభ ఏర్పాటుచేయబడినది.

-పందిరి మల్లికార్జునరావు,
కార్యకర్త.

# సురజ్‌మల్స్

1895 నుండి నగల వర్తకులు

★

రత్నాలు

**313, ఎస్ప్లనేడ్, మద్రాసు.**

8—(S—7)

లాల్జి గోధు & కంపెనీవారి

# ఎల్.జి

ఇంగువను




మార్కు గమనించి
కొనుడు
మోసపోకుడు

**లాల్జి గోధు అండ్ కో**
సౌకారపేట, మదరాస్

(L.G 8-7)

# శ్రీ రామకృష్ణమఠ ప్రచురణములు

## శ్రీ రామకృష్ణ బోధామృతము (సంగ్రహ జీవితసహితము)

540 పుటలు సర్వాంగ సుందరమగు చతుర్థ ముద్రణము వెల రూ. 3–4–0

## శ్రీ మద్భగవద్గీత

480 పుటలు శ్రీధరీయ టీకాసార ప్రతిపద టీకా తాత్పర్య విశేషార్థ సహితము రూ. 3–0–0

## శ్రీ వివేకానంద జీవిత చరిత్ర

350 పుటలు పండిత పామర రంజకమైన శైలి. ముచ్చటగు 5-వ కూర్పు రూ. 2–8–0

## శ్రీ శారదాదేవి చరిత్ర

256 పుటలు ఇంటింటను ఉండతగిన దివ్యగ్రంథము. ముద్దులొలుకు రెండవ కూర్పు వెల రూ. 1–12–0

## శ్రీ నాగమహాశయుని జీవిత చరిత్ర

136 పుటలు (ఆదర్శప్రాయుడగు గృహస్థుని జీవితము) వెల రూ. 1–4–0

| | | | | |
|---|---|---|---|---|
| శారదా ప్రసంగములు | ... | 2 | 8 | 0 |
| ప్రబోధరత్నాకరము | ... | 2 | 4 | 0 |
| రాజయోగము | ... | 2 | 4 | 0 |
| కర్మయోగము | | 1 | 8 | 0 |
| భక్తియోగము | ... | 1 | 4 | 0 |
| వివేకానందలేఖావళి (మొదటి భాగము) | | 1 | 8 | 0 |
| వివేకానందలేఖావళి (రెండవ భాగము) | | 1 | 8 | 0 |
| అనుష్ఠాన వేదాంతము | ... | 1 | 4 | 0 |
| వివేక సూర్యోదయము | ... | 1 | 0 | 0 |
| శ్రీ పరమహంస నీతికథా రత్నములు | | 0 | 12 | 0 |
| భక్తిమార్గము | ... | 0 | 8 | 0 |
| చికాగో నగరోపన్యాసములు | ... | 0 | 8 | 0 |

| | | | | |
|---|---|---|---|---|
| గురూపదేశములు | ... | 0 | 8 | 0 |
| నా సంస్కరణ యుద్ధవిధానము | ... | 0 | 6 | 0 |
| నా గురుదేవుడు | ... | 0 | 6 | 0 |
| శ్రీ పరమహంస జీవిత సంగ్రహము | | 0 | 4 | 0 |
| నవీన భారతదేశము | ... | 0 | 4 | 0 |
| ముక్తిమార్గము | ... | 0 | 3 | 0 |
| సర్వం విష్ణుమయం జగత్ (తెలుగు) | | 0 | 3 | 0 |
| శ్రీ రామనామ సంకీర్తనము | ... | 0 | 1 | 0 |
| యతిగీతము (పద్యకావ్యము) | ... | 0 | 1 | 0 |
| నా మతము 0 0 6 | డజను | 0 | 5 | 0 |
| సింహ గర్జన 0 0 6 | డజను | 0 | 5 | 0 |

ఇవియేకాక

సంస్కృత, ఆంగ్ల, ద్రావిడ, హిందీ, కన్నడ గ్రంథములును

**వేదాంత కేసరి (ఆంగ్లము) శ్రీ రామకృష్ణ విజయము (తమిళము)**

అను మాస పత్రికలును మా యొద్ద దొరకును

శ్రీ రామకృష్ణ పరమహంస, శ్రీ శారదాదేవి, శ్రీ వివేకానందస్వామి

మున్నగువారి ఛాయాచిత్రములును మా యొద్ద దొరకును

ఇట్లు వ్రాయుడు:

మేనేజరు, శ్రీ రామకృష్ణమఠము, మైలాపూరు, చెన్నపురి.

సంపాదకులు: శ్రీ ఋతజానందస్వామి; శ్రీ వెదురుమూడి వేంకటకృష్ణరావు
శ్రీ కే. ఎస్. ఎన్. రాజన్ గారిచే ది జ్యూపిటరు ప్రెస్సు లిమిటెడ్ (జి. టి. మద్రాసు) న ముద్రింపబడి,
శ్రీ ఆదిదేవానంద స్వామిచే శ్రీ రామకృష్ణమఠము (మైలాపూరు) నుండి ప్రచురింపబడినది. 20-1-52